బద్వేల్ ఏఐఎస్ఎఫ్ నూతన పట్టణ కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-బద్వేల్ : బద్వేల్ సిపిఐ జే.వి భవన్ లో ఏఐఎస్ఎఫ్ బద్వేల్ ఏరియా కార్యదర్శి ఎం. అశోక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఏఐఎస్ఎఫ్ పట్టణ కమిటీ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బాలు మాట్లాడుతూ 86ఏళ్ల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య అని వారు తెలిపారు. విద్యారంగ సమస్యలు ఎత్తిచూపుతూ పెద్ద ఎత్తున తిరుగుబాటు జెండా ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్యచరణ రూపొందిస్తున్నామని ఆ రకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సామాజిక రంగాలకు సంబంధించిన మానవ హక్కులను కాపాడే విధంగా చరిత్ర వక్రీకరణ, సాంస్కృతిక వర్గీకరణ వ్యవస్థలో పాలకులు తీసుకువచ్చిన పాలసీలు ఏ వర్గ ప్రయో జనాల కోసం కాదని ఎత్తిచూపుతూ భారతదేశం ఒక్కరికి సొంతం కాదని ఎందరో త్యాగధనుల రక్తార్పణతో సాధించుకున్నదన్నా రు. నూతనంగా ఎన్నుకున్న ఏఐఎస్ఎఫ్ పట్టణ కమిటీ భిన్నత్వంలో ఏకత్వంగా ఐక్యతను చాటుతూ అందరికీ విద్యా, వైద్యం ఉపాధి హక్కుల కోసం నిర్విరామం పోరాటం కొనసాగించాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా లక్ష్మణ్, అధ్యక్షులుగా రవి, సహాయ కార్యదర్శులుగా బన్నీ, రాజేంద్ర, దీప, విజయ కుమారి, ఉపాధ్యక్షులుగా మహీ, శివ, హితేష్, మల్లేష్, కోశాధికారి ప్రభాష్, కమిటీ సభ్యులు 10 మంది సాయ్, వెంకటేష్, తేజ, అభిరామ్, నానీ, చరణ్ తదితర్లు పాల్గొన్నారు.

సి.పి.యస్ రద్దు హామీని అమలు చేయాలి: ఎస్టీయు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : జీవిత కాలం పాటు ప్రజలకు, ప్రభుత్వానికి సేవ చేసిన ఉద్యోగ ఉపాధ్యాయుల పదవీ విరమణానంతరం పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వాల బాధ్యత అని ఎస్.టి.యు జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని ఎస్.టి.యు భవన్ నందు రీజనల్ కన్వీనర్ కె.పుల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన ప్రాంతీయ సమావేశంలో పాల్గొన్న రమణారెడ్డి మాట్లాడుతూ అధికారంలోనికి వచ్చిన వారంలోపు రద్దు చేస్తామని చెప్పిన హామీని ఇంతవరకు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. సిపియస్ ను రద్దు చేసిన రాష్ట్రాలకు, ఇప్పటి వరకు జమచేసిన నిల్వలను ఇవ్వడం సాధ్యం కాదనే కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన చూస్తే, సిపియస్ రద్దు విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో అర్థమవుతుందన్నారు. సిపియస్ ను రద్దు చేసి ఓపియస్ ను అమలు చేయాలే తప్ప ఎలాంటి ప్రత్యామ్నాయాలను అంగీరించేదిలేదన్నారు. ఎం.ఎల్.సీ ఎన్నికల ప్రక్రియలో ఎలక్షన్ కమీషన్ ఇచ్చిన నిబంధనలు పాటించని అధికారులపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమీషన్ కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాలరాజు, చంద్రశేఖర్, రామచంద్రారెడ్డి, జిల్లా నాయకులు విజయభాస్కర్, శివారెడ్డి, రవీంద్రబాబు, రాజగోపాల్, మండల నాయకులు సుబ్రమణ్యం, కుమార్ బాబు, శ్రీనివాసులు, వెంకట రెడ్డి, కో కన్వీనర్ వెంకటసుబ్బయ్య, వెంకటరామయ్య, వెంకట సుబ్బారెడ్డి, బాలఓబయ్య, జయరామిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ దినేష్ హాస్పిటల్‌లో అడ్వాన్స్‌డ్ లివర్ క్లినిక్ వైద్య సేవలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : భారతదేశంలోనే లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్, లివర్, ప్యాంక్రియాస్ వ్యాధులకు అత్యంత ఆదరణ కలిగిన గ్లేనిగల్స్ గ్లోబల్ హెల్త్ సిటీ, చెన్నై వారు తమ సేవలను కడప జిల్లా వాసులకు అందించాలనే సదుద్దేశంతో అధునాతన సూపర్ స్పెషాలిటీ లివర్ క్లినిక్ ను అందుబాటులోకి తెచ్చామని గ్లేని గర్ల్స్ గ్లోబల్ హెల్త్ సిటీ చెన్నై, డైరెక్టర్ డాక్టర్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఓడి కార్పోరేట్ రిలేషన్స్ వి. భాస్కర్ రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం కడప నగరం నాగరాజు పేట లోని డాక్టర్ దినేష్ హాస్పిటల్ లో అడ్వాన్స్ లివర్ క్లినిక్ ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో లివర్ బారిన పడుతున్న రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగు తూ ఉందన్నారు. కాబట్టి ఈ వ్యాధిపై అవగాహన తీసుకురావడం, అలాగే వ్యాధి బారిన పడిన వారికి ఆరోగ్య సలహాలు, సూచనలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ లివర్ విభాగంలో అత్యంత ప్రాచుర్యం పొందిన గ్లేని గర్ల్స్ గ్లోబల్ హెల్త్ సిటీ చెన్నై వారు దేశం నలుమూలల తిరుగుతూ ఈ వ్యాధిపై అవగాహన పెంచుతున్నా రన్నారు. అందులో భాగంగానే కడపలో వైద్య సేవలు ప్రారంభించ మన్నారు. ప్రతి నెల నాలుగవ శనివారం అందుబాటులో ఉంటామ న్నారు. ఈ లివర్ వ్యాధి బారిన పడిన రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తుంన్నందుకు రోగులు ఈ వ్యాధిని జయించి సాధారణమైన జీవితం గడుపుతున్నారన్నారు. అందుకు ఏపీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని లివర్ వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకొని ఆనంద జీవితాన్ని సాగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దినేష్ రెడ్డి, 21వ డివిజన్ వైసిపి ఇన్చార్జ్ ఐస్క్రీం రవి, కార్పొరేటర్ షఫీ, లివర్ వ్యాధితో బాధపడి సర్జరీతో బాగుపడిన కడప వాసులు అయేషా, ఉదయగిరి ఇమామ్ భాష, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాలపై సీబీఐతో విచారణ చేపట్టాలి

విశాలాంధ్ర-బద్వేల్ : మాల మహాసేన జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సీనియర్ దళిత నాయకులు బండి జకరయ్య మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలో 150 ఎకరాల్లో దాదాపు అన్యాక్రాంతం అయినదని, మడకలవారిపల్లె ,గోపవరం, గుంతపల్లె బయనపల్లె, చెన్నంపల్లి పంచాయతీ పొలాల్లో వెంచర్లు వేయడం,స్మశానవాటికలు వంకలు, కుంటలు, చెరువులు పోరంబోకు స్థలాలు ఆక్రమణలు జరిగాయని, ఎన్జీవో ప్లాట్లు దాదాపు 300 ప్లాట్లు ఆక్రమించుకోవడం జరిగిందని, ప్రజా సంఘాలు అధికారులకు విన్నవించిన న్యాయం జరగలేదన్నారు, 922/2, 922/1922/3 లో రెండు ఎకరాల 67 సెంట్లు ఆక్రమించుకున్నారని దానిపై కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌కి స్పందనలో ఫిర్యాదు చేశామని స్పందనలో ఇచ్చిన అర్జీ పై ఎలాంటి విచారణ చేయని అధికారులు, ఎమ్మార్వో కింది అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇలాంటి అధికారులను సస్పెండ్ చేయాలని ప్రజాసంఘాలు డిమాండ్. ఈ భూ కబ్జాల పైన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సిబిసిడి కి ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ మాల మహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి, బీసీ నాయకులు పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

సెల్ ఫోన్లే.. యమపాశ మాయనే.!

రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న టీనేజర్లు - నియమ నిబంధనలకు పాతర- పోలీసులు కేసులు రాస్తున్న మారని వైనం
వాహనం నడుపుతూ బైక్ పైన సెల్ మాటలే- ఆటలు, పాటలు అన్నీ సెల్ ఫోన్‌లోనే

విశాలాంధ్ర -రాజంపేట: సమయం విలువైనదే.. కానీ ప్రాణం అంతకంటే విలువైనదని నేటి యువత గ్రహించలేకపోతున్నారు. రోడ్లపై వాహనాలు నడుపుతున్నప్పుడు కూడా సెల్ ఫోన్ మాట్లాడుతూ వారితో పాటు పక్కవారిని కూడా ప్రమాదాలకు గురయ్యాలా చేస్తున్నారు. మనిషి జీవితంలో సెల్ ఫోన్ కూడా ఒక భాగమైంది.ఒక్క నిమిషం చేతిలో ఫోన్ లేకుంటే ఏదో పోగొట్టుకున్నంతలా సమాజం మారిపోయింది. ఎక్కడ ఉన్నా.. ఏం చేస్తున్నా..జేబులో, చేతిలో ఫోన్ ఉండాల్సిందే.అవసరం ఉన్నా లేకున్నా వాటితోనే మాటలు, ఆటలు, నిత్యం సేల్ వినియోగంతో ఆరోగ్య సమస్యలు తలెత్తయని వైద్యులు హెచ్చరిస్తున్న.. వాటి గురించి పట్టించుకునే వారే కరవయ్యారు.సెల్ఫోన్ వినియోగం ఎంతలా పెరిగిందనే దానికి రాజంపేట పట్టణ కేంద్రంలో ప్రతిరోజు చోటు చేసుకుంటున్న సంఘటనలే సజీవ సాక్ష్యం అని చెప్పడంలో సందేహం లేదు. ప్రతిరోజు పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నా.. సెల్ మోహనరంగా అంటూ సాగిపోతున్నారు. ఇటువంటి పరిస్థితులలో టీనేజర్లే అధికంగా రోడ్డు ప్రమాదాలకు గురువుతూ సెల్ ఫోనే.. యమపాశ మాయనే.! అనే పరిస్థితి నెలకొంది.

మనిషి జీవితంలో సెల్ ఫోన్ అతి ముఖ్యమైన భాగమై పోయింది.ఎంతగా అంటే సెల్ ఫోన్ డ్రైవింగ్ అతి ప్రమాదకరమని తెలిసినా.. పట్టణ పోలీసులు కేసులు రాస్తున్న..వెరవటం లేదు.బెదరడం లేదు.వాహన డ్రైవింగ్ లో ఉన్నప్పుడు ఫోన్ మాట్లాడవద్దని ప్రభుత్వం పలు విధాలుగా ప్రచారం నిర్వహిస్తున్నప్పటికీ వినే నాథుడే కరువయ్యాడు.సమయం, సందర్భం లేకుండా సెల్ వినియోగం ముప్పు తెస్తుందన్న పట్టడం లేదు.కళ్ళ ముందే ప్రమాదాలు జరుగుతున్న మానటం లేదు. అంతలా మనిషి జీవితంలో సెల్ ఫోన్ విడదీయలేనిది అయిపోయింది.వాహనం నడిపేటప్పుడు ఫోన్ మ్రోగిందంటే చాలు వాహనం నిలుపుదల చేసో లేక పక్కకు తీసి మాట్లాడాలన్నా కనీస ఆలోచన కూడా పట్టణ ప్రజలు చేయడం లేదు. ఇంటిదగ్గర కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు అన్న సంగతి మరచి యదేచ్చగా ప్రయాణంలో సెల్ ఫోన్ వాడుతున్నారు.వాహనం నడుపుతూ సెల్ఫోన్ మాట్లాడడం నేరమైన పట్టించుకోవడం లేదు.బైక్ పై వెళుతూ మెడ క్రింద ఫోన్ పెట్టి రకరకాల విన్యాసాలు చేస్తూ చూపరులను సైతం ఆశ్చర్య చకితులను చేస్తున్నారే తప్ప నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తుందన్న సంగతి మరుస్తున్నారు.భద్రతా విషయంలో మనకు ఒకరు చెప్పాలా..అని ప్రశ్నించుకున్నప్పటికీ మార్పు రానంత వరకు ఎటువంటి నియమ నిబంధనలు ఏమి చేయలేవనిపిస్తుంది.

అవగాహన ముఖ్యం

అయితే పట్టణంలో చోటు చేసుకుంటున్న ప్రమాదాలకు సగభాగం సెల్ ఫోన్లు కారణమని ప్రజలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.పోలీసులు కూడా నిత్యం ప్రధాన రోడ్ల వద్ద చలానాలు కాకుండా అవగాహన కల్పిస్తున్న వాహనదారుల తీరు మారడం లేదు.విద్యా సంస్థల వారిగా విభజించి ప్రభుత్వ సంబంధిత విభాగాల సౌజన్యంతో అవగాహన కార్యక్రమాలు చేయబడితే సత్ఫలితాలువస్తాయని మేధావులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.అదేవిధంగా కేసులు, జరిమానాలు, జైలు శిక్షలు వంటి విషయాలపై కూడా అవగాహన కల్పించాలంటున్నారు.



జన్మదిన వేడుకలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక పురపాలిక పరిధిలో నడిఊరుకు చెందిన భూస్వామి (ల్యాండ్ లార్డ్) బోయపల్లె రవి కుమార్ రెడ్డి మనువడు, కౌసల్‌రెడ్డి, నందిని దంపతుల కుమారుడైన చిరంజీవి భరద్వాజ్‌రెడ్డి పుట్టిన రోజు వేడుక ఆదివారం రవి కుమార్ రెడ్డి స్వగృహంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం లో స్థానిక ఎమ్మెల్యే డా.మూలె సుధీర్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్ రెడ్డి పాల్గొని చిన్నారి భరద్వాజ్‌రెడ్డిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జన్మదిన కేక్ కట్ చేసి ఆహుతులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ వేడుకలో రవికుమార్‌రెడ్డి బంధువు లు, మిత్రులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు, వ్యాపారవేత్తలు, పురప్రము ఖులు, పెద్ద సంఖ్యలో పాల్గొని విందు భోజనం స్వీకరించారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖులతో ఎమ్మెల్యే కొద్దిసేపు రాజకీయాలపై ముచ్చటించడంతో పాటు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు సాగులో ఉన్న పంటలకు ప్రయోజనకారి అని పలువురు ఎమ్మెల్యేతో అనడం కనిపించింది. ఈ వర్షం పంట మొక్కల ఎదుగుదలకు దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : జిల్లాలో గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఉషారాణి, గ్రంథాలయ కార్యదర్శి అమీరుద్దీన్ ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యను అందించడంలో గ్రంథాలయాలు ఎంతో ముందున్నాయని జిల్లాలో గ్రంథాలయ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తూ డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వారం రోజుల పాటు జిల్లా గ్రంథాలయాల అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన పలువురిని సన్మానించడం జరుగుతుందని ప్రతి రోజు ఒక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతిభ గల విద్యార్థులను వెలికి తీసి సన్మాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం కొండాయ పల్లి గ్రంథాలయ వారోత్సవాల ఏర్పాట్లలో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనాలన్నీ రంగుల కాగితాలతో కళ కళ లాడుతున్నాయి. సాయంత్రం వేళల్లో విరజిమ్మే విద్యుత్ కాంతులతో శోభయమానంగా ఉంటుంది. బాలల దినోత్సవం రోజున బాలల కోసం కావలసిన ఏర్పాట్లు అన్ని సిద్ధం చేశారు. ముగింపు రోజున జరగాల్సిన కార్యక్రమాలు ప్రముఖుల చేత జెండా ఎగురవేయుటం, జవహర్ లాల్ నెహ్రూ స్వాతంత్ర్య సమర యోధులను గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేసిన ప్రముఖులను స్మరించటకు, వేషధారణ పోటీలకు స్టేజీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా పండగ వాతావరణం తలపించేలా జిల్లా గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించేందుకు జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

వైభవంగా పైడికొండరామస్వామి ఉత్సవాలు

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం గ్రామంలోని ముకుందాశ్రమంపై వెలసిన శ్రీశ్రీశ్రీ పైడికొండ రామస్వామి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయని కార్తీక మూడవ సోమవారం సందర్భంగా ఈ ఉత్సవాలు జరుగుతాయని ధర్మకర్తలు తెలిపారు. ఆదివారం కార్తీక మాసం సందర్భంగా ఉదయం 9 గంటలకు మహాగణపతి పూజ, పుణ్యావాచనం, పంచామృతాభిషేకం తీర్థప్రసాదాలు అందించడం జరిగిందన్నారు. 14వ తేదీ సోమవారం ఉదయం నుంచి స్వామి వారికి పూజా కార్యక్రమాలు జరుగుతాయని అనంతరం తీర్థప్రసాదాలు జరుగుతాయని ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు. ఈకార్యక్రమానికి మండలంలోని భక్తులు పాల్గొని దేవుని కృపకు పాత్రులు కావాలని ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వైవీయూ ఖర్చులపై శ్వేత పత్రం విడుదల చేయాలి
ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-కడప వైవీయూ : వైవీయూ న్యాక్ కమిటీ వస్తున్న సందర్భంగా దాదాపు 10 కోట్లు దాకా ఖర్చు చేసినట్లు సమాచారం ఇందులో 60 నుంచి 70 శాతం మాత్రమే ఖర్చుచేసి మిగిలిన డబ్బు మొత్తం అధికారులు పంచుకున్నారనీ ఆరోపిస్తూ దీనిపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి.గంగా సురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి. వలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ప్రెస్ క్లబ్లో వారు విలేకరులతో మాట్లాడుతూ వైవీయూ న్యాక్ సందర్శన, పరిశీలనకు వస్తున్న సందర్భంగా రోడ్ల విస్తరణ, సుందరీకరణ, మరమ్మతులు చేయించటం, సోలార్ లైట్లు కంప్యూటర్లు, సీసీ కెమెరాలు, కుర్చీలు, కొనుగోళ్ల మార్కెట్ లో ఉన్న ధర కంటే ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేశారని గ్రీనరి పేరుతో విచ్చలవిడిగా ఖర్చు చేసి సొమ్ము చేసుకున్నారని మొత్తం అవినీతి అక్రమాలు జరిగాయని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. వీటిపై విశ్వవిద్యాలయ అధికారులు ముఖ్యంగా రిజిస్ట్రార్ స్పందించి మొత్తం ఎంత ఖర్చు చేశారు ఏ ఏ దానికి ఖర్చు చేశారో శ్వేత పత్రం విడుదల చేసి ప్రజలకు చెప్పాలన్నారు. వైవియూలో న్యాక్ సందర్భంగా ఎంత ఖర్చు చేశారు ఏ ఏ దానికి ఎంత ఖర్చు చేశారో ఖర్చు చేసిన లెక్క మొత్తం విశ్వవిద్యాలయ అధికారులు మీడియా ద్వారా ప్రకటించాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కొండయ్య, శ్రావణ్ కుమార్ రెడ్డి, నాగార్జున, ఏఐఎస్ఎఫ్ నగర ఉపాధ్యక్షులు శివ, కటారు శివ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విశేష స్పందన

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు వెనుక బడిన ప్రాంతమైన పాలెంపల్లెలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన గుంటి నాగేంద్రకు కాంట్రాక్టర్ పాలెం పల్లె రమణ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం స్థానిక పాలెం పల్లెలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో పేదలకు అన్ని విధాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు వారికి కావలసిన మందులు సుమారు నాలుగు లక్షల రూపాయల విలువచేసే మందులు డాక్టర్లు ఉచితంగా అందించారని తెలిపారు. ఈ సందర్భంగా గుంటి నాగేంద్ర మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరానికి సేవలందించేందుకు వచ్చిన డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రతినెల ఒకచోట పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కరోనా నేపథ్యంలో ఎంతోమంది కరోనా బారిన పడి ఇబ్బందులు పడ్డారని అటువంటి వారి కొరకు వైద్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చిన డైమండ్ మైక్రో మినరల్స్ అధినేత హరీష్, డాక్టర్ సురేంద్రబాబు లు ముందుకొచ్చి సహకరిస్తామని ధైర్యం ఇచ్చారు ఇలాంటి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయండి మా వంతు సహకారం ఉంటుందని ధైర్యం చెప్పారన్నారు ఈ మెగా వైద్య శిబిరంలో డాక్టర్ సురేంద్రబాబు డాక్టర్ సుష్మ డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి, డాక్టర్ నవీన్ ప్రసాద్, డాక్టర్ శ్వేతా రెడ్డి, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ శ్రావణ్ కుమార్, డాక్టర్ జాకీర్ హుస్సేన్, డాక్టర్ జయభారత్ రెడ్డి, స్నేహితులు పాలెంపల్లె వెంకటరమణ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలందించండి: కలెక్టర్

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : రామాలయంకు వచ్చే భక్తులకు మెరుగైన సేవలు, దైవదర్శనం పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉం చాలని కలెక్టర్ విజయ రామరాజు టీటీడీ అధికారులకు తెలిపా రు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా కోదండ రామాలయాన్ని సందర్శించారు. ఆలయ మర్యాదల ప్రకారం టీటీడీ అధికారులు, ఒంటిమిట్ట తాహసీల్దార్ శ్రీనివాసులురెడ్డి వేదపండితులతో ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనను దుశ్శాలువ, గజ మాలలతో సన్మానించి ఆలయ చరిత్ర వివరించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాలయానికి భక్తులు ఎక్కువగా వస్తున్నారని వారికి మెరుగైన సేవలందించాలని అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, రెవెన్యూ అధికారులు, వేద పండితులు పాల్గొన్నారు.

ఎన్ని కేసులైన పెట్టుకోండి :టీడీపీ

విశాలాంధ్ర- కడప కార్పొరేషన్ : అధికార పార్టీ వైసీపీ నాయకుల ఒత్తిళ్లతో అత్యుత్సాహం ప్రదర్శి స్తున్న పోలీసులపై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాస రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2 రోజుల నుండి జరుగుతున్న పరిణామాల పై పోలీసులు వ్యవహరి స్తున్న తీరును గమనిస్తున్నానని పోలీసులు ఏకపక్ష ధోరణి అధికార పార్టీ నాయకులకు భూ కబ్జాదారులకు తొత్తులుగా కొంత మంది పోలీసులు వ్యవహరిస్తున్నారని అన్నారు. టీడిపి నాయకుల పైన దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. డిప్యూటీ సిఎం అంజాద్ బాషా తమ్ముడు అహ్మద్ బాషా నాలుగు సెంట్ల స్థలం కోసం కొంతమంది రౌడీలతో టీడిపి పార్లమెంట్ నగర సేకరెట్రి జమీల్ మరియు తమ్ముడి పైన కట్టెలతో, రాడ్డులతో దాడి చేయడం హేయమైన చర్యఅన్నారు. న్యాయాన్ని కాపాడాల్సిన పోలీసులే అధికార పార్టీ నాయకు లకు కొమ్ముకాస్తున్నారు. అక్రమంగా సుబ్బారెడ్డి ,రాజా మరి కొంత మంది పై కేసులు పెట్టి వేధించడం పద్ధతి కాదని ఆయన హెచ్చరించారు. లక్కిరెడ్డిపల్లె లో రాయచోటి నియోజగ వర్గా ఇంచార్జి రమేష్ రెడ్డి మీద అక్రమంగా కేసులు పెట్టారు. ఎవరు ఎన్ని అక్రమ కేసులు పెట్టిన భయపడే ప్రసక్తే లేదని అన్ని గుర్తు పెట్టుకుంటామని సరైన సమ యంలో సరైన జవాబు చెప్తాం..కొంత మంది పోలీసులు తమ పరిధిలో ఉండి విధులు నిర్వహిస్తే మంచిదని ఆయన హెచ్చరించారు.

రాష్ట్ర ప్రజలను నిరాశపరిచిన మోడి రాష్ట్ర పర్యటన

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రధాని మోడి రాష్ట్ర పర్యటన ప్రజలను నిరాశపరిచిందని కాంగ్రేస్ పార్టీ పట్టణ ఇంచార్జ్ పీఎమ్‌డి నజీర్ అహమ్మద్ పేర్కొన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మోడి పర్యటన ఒట్టి చేతులతో సాగిందని, ప్రత్యేక హొదా ప్రస్తావన లేదని, బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ఊసేలేదని అన్నారు. కడప జిల్లా స్టీల్ ప్లాంట్, దుగ్గరాజ పట్నం ఓడరేవు, రాజధానికి నిధులు, పోలవరం ప్రాజెక్టు, విశాఖ- విజయవాడ మెట్రో, విశాఖ రైల్వేజోన్ గురించి మాట్లాడకపోవడం దారుణం అన్నారు. మోది పర్యటనలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కాకా రెడ్డిగా నిరూపించుకున్నాడని అన్నారు. అధికారంలోకి రాకముందు కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హొదా సాధిస్తా అన్నాడరి, నేడు అధికారంలోకి వచ్చాక కేంద్రం ముందు మెడలు వంచి అభ్యర్థిస్తున్నాడని అన్నారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు బీజేపీ చేతిలో కీలు బొమ్మలని తేలిపోయిందని అన్నారు. ప్రత్యేక హొదా రావాలన్న విభజన చట్టంలోని అంశాలు అమలు కావాలన్న, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలన్న కాంగ్రేస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన చారిత్రక ఆవశ్యకత ఉందన్నారు.

అందుబాటులోకి ఆర్య న్యూరో డెంటల్ డెర్మ హాస్పిటల్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : చర్మ వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల వైద్య చికిత్సలను అందిస్తామని ఆర్య న్యూరో డెంటల్ నిర్వాహకురాలు డాక్టర్ జి. దివ్యశ్రీ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో హాస్పిటల్ లో విలేకరులతో ఆమె మాట్లాడు తూ ముఖానికి సంబంధించిన లేజర్ మచ్చలకు చికిత్స చేయబడును అని తెలిపారు. చర్మవ్యాధులకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులను నయం చేస్తామని పేర్కొన్నారు. తలకు జుట్టు రాలడం వంటి సమస్యలను నివారిస్తామన్నారు. బాడీలోని అధిక శాతం నిలువవున కొవ్వు పదార్థాలను తగ్గిస్తామని చెప్పారు. చేతులు తొడలు కాళ్లు వాపులు మిషన్తో సరి చేయడం జరుగుతుందన్నారు. మొఖం నందు ఐబ్రోస్ తెల్ల మచ్చలు మొటిమలు తెలిపారు. కడపలోనే మొట్టమొదటిసారిగా ఇలాంటి చర్మ వ్యాధులకు అధునాతన వైద్యం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల సుబ్బారెడ్డి, కిరణ్, గోవింద నాగరాజు, నగరంలోని ప్రముఖ డాక్టర్లు, బంధువులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో విశ్రాంతి భవనం



విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల కేంద్ర పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారి మఠంలో ఉన్న పర్యాటక శాఖ విశ్రాంతి భవనం శిధిలావస్థకు చేరుకుంది. ఒకప్పుడు పర్యాటకులతో కళకళలాడుతున్న ఈ విశ్రాంతి భవనం నేడు శిధిలావస్థకు చేరుకున్న పర్యాటకశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. బ్రహ్మంగారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు విశ్రాంతి భవనం ఎంతగానో ఉపయోగకరంగా ఉండేది. 2006వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పర్యాటక కేంద్రాలకు అధిక ప్రధాన్యత ఇవ్వడంతో బి.మఠంలో అప్పటికే ఉన్న విశ్రాంతి భవనానికి ప్రత్యేక నిధులు కేటాయించి నూతనంగా రూపుదిద్దారు. మూడు డబుల్ బెడ్ రూములు, అతిపెద్ద కామన్ హాల్, కిచెన్, సమావేశ మందిరం, విశాలమైన ప్రదేశం, వాహణాల పార్కింగ్ వంటి సౌకర్యాలు కల్పించాలని రాజకీయ నాయకులు సైతం అక్కడనే సభలు, సమావేశాలు నిర్వహించుకునేవారు. అక్కడ ఇద్దరు వాచ్‌మేన్‌లు, ఒక్క ఒంటరి మనిషి ఉండేవారు. పర్యాటకులు వస్తుండటంతో ఆదాయం కూడ బాగానే ఉండేది. గత 10సంవత్సరాలుగా పర్యాటక శాఖ అధికారుల నిర్లక్ష్యంతో శిధిలావస్థకు చేరుకుంది. బ్రహ్మంగారి మఠంలో యాత్రికుల కోసం సరైన విశ్రాంతి భవనాలు ఇబ్బందులు తప్పడం లేదు. కనీసం వాచ్మెన్ కూడ లేకపోవడంతో విశ్రాంతి భవనం ప్రాంగణం అంతా అపరిశుభ్రంగా మారింది. ఇప్పటికైన పర్యాటక శాఖ అధికారులు పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారి మఠంను దృష్టిలో ఉంచుకొని శిధిలావస్థకు చేరుకున్న విశ్రాంతి భవనాన్ని పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు. ప్రజా ప్రతినిధులు స్పందించాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా



రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టిన సీఎం జగన్

సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: రాష్ట్రానికి రావాల్సిన వాటాల ప్రస్తావన లేకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తన వ్యక్తిగత ప్రయోజనాలకై రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పెన్నానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ పార్టీ కౌన్సిల్ సమావేశంలో జి.చంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి నిధులు, పరిశ్రమలు, ప్రత్యేక హోదా తదితర అంశాలపై విశాఖకు వచ్చిన ప్రధాని మోడి వద్ద ప్రస్తావన తేకుండానే సాగిలపడ్డారని అన్నారు. మోడి విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకారి కోసమే విశాఖ రైల్వేస్టేషన్ ఆధునీకరణకు నిధులు గుప్పించారని అన్నారు. తద్వారా అభివృద్ధి చూపి కార్పొరేట్లకు మన్యం జిల్లాలోని ప్రకృతి సహజ సంపదను దోచిపెట్టే బీజేపీ కుట్రను వైసీపీ సహకరించడమే అన్నారు. ఉమ్మడి జిల్లాలో 125టీఎంసీలు నీరు నిల్వ ఉన్న పంట కాల్వలకు ఒక్క చుక్క నీటిని కూడ ప్రభుత్వం విడుదల చేయ లేదన్నారు. ప్రజలకందించే మౌలిక వసతుల కల్పనకూడ సర్వీస్ ఛార్జీల పేరుతో ముక్కుపిండి జగన్ వసూలు చేస్తున్నాడని అన్నారు. చెత్తపై చెత్త పన్ను వసూల్‌చేయడం దుర్మార్గమని, బీజేపీ, వైసీపీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ కార్యకర్తలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ ఇంచార్జ్ బి.రామయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంవీ సుబ్బారెడ్డి, పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు, శాఖ కార్యదర్శులు నాగరాజు, ప్రమీళ, చంద్రశేఖర్, శివారెడ్డి, మద్దిలేటి, షరీఫ్, యేసోబు, ఎల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రూబెన్స్, రామకృష్ణ పాల్గొన్నారు.

చౌకదుకాణం బియ్యం పట్టివేత

విశాలాంధ్ర-ముద్దనూరు : ప్రజాపంపిణీ వ్యవస్థకు చెందిన చౌకదుకాణం బియ్యంను అక్రమంగా తరలిస్తుండగా స్థానిక పోలీసులు శనివారం సాయంత్రం పట్టుకున్నారు. ఎస్ఐ చంద్రమోహన్ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దనూరు, పులివెందుల రహదారిలో స్థానిక చిన్నదుద్యాల క్రాస్ వద్ద సుమారు రూ.66 వేల విలువ చేసే 35 బస్తాల బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. యర్రగుంట్లకు చెందిన ఆంజనేయులు, సుంకన్న చౌక బియ్యాన్ని ముద్దనూరు, తొండూరు మండలాల్లో కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నారు. వారిని అరెస్టుచేసి కేసు నమోదు చేశారు.

వెల్లాల ఆలయాల్లో పూజలు

విశాలాంధ్ర-రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని శ్రీ చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం కావడంతో భక్తులు ఆలయాల్లోని ధ్వజస్తంభాల వద్ద, కుందూనది, కాలువల్లో దీపాలు వెలిగించారు. ఆలయ చైర్ పర్సన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు కానాల బలరామిరెడ్డి, భక్తులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు సంజీవరాయ అన్నదాన సత్రంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యేను పరామర్శించిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర-చాపాడు : ఇటీవల మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని వైఎస్సార్‌సీపీ నేతలు పరామర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కడప నగర మేయర్ సురేష్ బాబు, వ్యవ సాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి, కమిటీ సభ్యుడు నారాయణరెడ్డి, చాపాడు జెడ్పీటీసీ శాంతరాజు, బ్రహ్మంగారిమఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-మైదుకూరు : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద కల్పిస్తున్న పనులను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి ఏపీడీ శివ ప్రసాద్ అన్నారు. మైదుకూరులో ఉపాధి పనులపై ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. మండలంలో 15, 16 విడతల కింద ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2022 వరకు, అక్టోబరు 2022 నుంచి నవంబరు 2022 వరకూ నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీలు జరిపినట్లు తెలిపారు. పనులను సక్రమంగా నిర్వహించి పేదలకు ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు.

కల్వర్టు నిర్మాణానికి పరిశీలన

విశాలాంధ్ర-దువ్వూరు: మండల పరిధిలోని నీలాపురం -సుగాలీ తాండాల మధ్య ఉన్న వంకపై కల్వర్టు నిర్మాణానికి శని వారం పంచాయతీ రాజ్ ఎస్ఈ డీవీ శ్రీనివాసులరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేషనల్ హెల్త్ ఎన్‌కమిషన్ ఆదేశాల మేరకు పరిశీలించినట్లు ఆయన తెలిపారు. కల్వర్టు నిర్మాణానికి సంబంధించి వ్యయాలను, అంచనాలను తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామయ్య, పీఆర్ ఏఈ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-చాపాడు : ఈ నెల 14 నుంచి 20వ తేది వరకూ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి శివశంకర్ రెడ్డి తెలిపారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న జాతీయ గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ, 17న వకృత్వ, చిత్ర లేఖనం పోటీలు ఉంటాయ న్నారు. అలాగే 18న వ్యాస రచన పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు అంది స్తామని తెలిపారు.

భక్తులతో అన్నదానం

విశాలాంధ్ర-చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన భక్తుడు రామ్‌ధీన్ చౌదరి శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గండికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. తాను ఆంజనేయస్వామి భక్తుడినని వ్యాపార రీత్యా కొంత కాలంగా పులివెందులలో ఉంటున్నట్లు ఆయన చెప్పాడు. అన్నదానం చేయాలని భావించి ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుంద రెడితో అనుమతి తీసుకుని అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాను గండికి రావడం కూడా ఇదే మొదటిసారి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో14 గొర్రెలు మృతి

విశాలాంధ్ర-జమ్మలమడుగు రూరల్ : కడప జిల్లా జమ్మలమడుగు మండలం గూడెం చెరువు గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో 14 గొర్రెలు చనిపోయయి. దువ్వూరు మండలం ఇడమరక గ్రామానికి చెందిన బాలయ్య మరియు ముగ్గురు కలిసి గొర్రెలను రోడ్ దాటిస్తుండగా గండికోట వైపు నుండి అతివేగంగా వచ్చిన కారు గొర్రెల మందకు తగిలింది. గొర్రెల కాపరి బాలయ్య క్రిందపడి స్వల్ప గాయాలయ్యాయి. 10 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందగా, ఆదివారం 4 గొర్రెలు చనిపోయయి. గాయపడిన బాలయ్య ను చికిత్స నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు జమ్మలమడుగు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుంతలు పూడ్చండి మహాప్రభో..!

లబోదిబోమంటున్న వాహనచోదకులు- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక నాలుగు రోడ్ల కూడలి ప్రొద్దుటూరు వైపు రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రారంభ ప్రదేశంలో స్పీడ్ బ్రేకర్ వద్ద ఏర్పడిన గోతిని పూడ్చడంలో సంబందిత అధికారులు విఫలం అయ్యారు. ఫలితంగా వాహనచోదకులు ముఖ్యంగా కార్లు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది ఇక్కడ కింద పడి గాయాలపాలైన ఘటనలు కూడా ఉన్నాయి. గుంత రోజురోజుకు పెద్దదై ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రహదారిలో అనేక మంది అధికారులు ప్రయాణిస్తూ ఉంటారు. అలాగే ప్రజా ప్రతినిధులు సైతం రాకపోకలు కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ ఏ ఒక్కరి బుర్రకు గోతులను పూడ్చాలన్న ఆలోచన తట్టకపోవడం ప్రజలు చేసుకున్న కర్మ కాబోలు.

ఈ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తూ రద్దీగా ఉంటుంది. ఇదే రోడ్డులో పలు చోట్ల ప్యాచింగ్ పనులు చేపట్టిన అధికారులకు బ్రిడ్జి ప్రారంభంలోనే ఉన్న అతి పెద్ద గోతి కనిపిం చక పోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలోని మెయిన్ బజార్, ఎస్‌బిఐ ప్రధాన శాఖ (రాణివనం) వద్ద మోకాలు గుంతలు ఉన్నప్పటికీ అటు అధికారులు కానీ ఇటు ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకున్న దాఖలాలులేవు. ఇప్పటికైనా సంబందిత అధికారులు వాహనదారులకు ప్రమాదకరంగా మారిన గోతులను పూడ్చేందుకు ప్యాచింగ్ పనులు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఘన సన్మానం

విశాలాంధ్ర-బద్వేల్ : బద్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ విజయమ్మ ఆధ్వర్యంలో యువ నాయకులు రితీష్ రెడ్డి సారధ్యంలో బద్వేల్ నియోజకవర్గం విచ్చేసిన మంగళగిరి కార్యాలయ ఆహ్వాన కమిటీ చైర్మన్ హాజీ హసన్‌భాష, మాజీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రస్తుత మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లాల్ వజీర్ ని మాజీ డైరెక్టర్ మహబూబ్ బాషా బిగ్బాస్ అన్న ఆధ్వర్యంలో తెలుగు యువత కడప పార్లమెంట్ ఉపాధ్యక్షులు షేక్ జహంగీర్ భాష వారిని ఘన స్వాగతం పలికి ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు అధికార ప్రతినిధి వాల్తాటి దానం, గుమ్మా వెంకటసుబ్బయ్య, గోపవరం మండల నాయకులు సుబ్బారెడ్డి, అబ్దుల్ సలాం, సత్తార్, మారయ్య పాల్గొన్నారు.

దిగజారుడు రాజకీయాలు చేస్తున్న సీఎం జగన్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : పరోక్షంగా టీడీపీ, జనసేన విశాఖ నగరంలో జరిగిన ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభను పూర్తిస్థాయిలో విజ యవంతం చేయగలిగారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు ప్రకటన తెలిపారు. టిడిపి పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బాలదాసు మాట్లాడుతూ సీఎం జగన్ ప్రధాని బహిరంగ సభలో ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ పోలవరం నిర్మాణం హామీలను పేలవంగా ప్రస్తావించడం జగన్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మోడీని ఎదిరించే ధైర్యం లేదన్నారు. జగన్ రెడ్డి జిల్లాకు ఒక వైద్య కళాశాల మంజూరు చేసి శంకుస్థాపనకే పరిమితమై ఇంతవరకు నిర్మాణాలు చేపట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర ఉపాధ్యక్షులు న్యాయవాది లింగాల శివశంకర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బం రెడ్డి, రమణారెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నబికొటు శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు నాదెల్ల దస్తగిరి, మూడవ డివిజన్ జి శ్రీనివాసులు, తప్పెట్ల శేఖర్ పాల్గొన్నారు.

నికా వేడుకలో రాజకీయ నేతలు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన నికా వేడుకలో పలువురు రాజకీయ నేతలు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. మల్లెల జిలాన్‌బాష కుమారుడు, షేక్ చాంద్‌బాష (మీసాల చాంద్) కుమార్తె వివాహ నేపథ్యంలో జరిగిన వేడుకలో స్థానిక ఎమ్మెల్యే డా.మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, టీడీపీ మండల పర్యవేక్షకులు చదిపిరాళ్ల జయరామిరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు వేడుకలో పాల్గొన్న వారితో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం విందు భోజనం ఆరగించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - వల్లూరు : వల్లూరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాల యంలో నెహ్రూ యువ కేంద్ర వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ జూటూరు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించామని పాఠశాల ప్రత్యేక అధికారిని నసీం మునిషా తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు బాలల దినోత్సవం పురస్కరించుకొని వ్యాసరచన పోటీల్లో ఫలితాలను సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తామని తెలిపారు.

పలుగురాళ్ల పల్లె-తోట్లపల్లె రహదారిపై బ్రిడ్జి నిర్మించాలి

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల పరిధిలోని తోట్లపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న పాపిరెడ్డి పల్లె గ్రామ సమీపం లోనే పలుగురాళ్లపల్లె వెల్లే ప్రధాన రహదారులు గ్రామానికి వెల్లే రహదారిపై పాపిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కాలువకు బ్రిడ్జి నిర్మించాలని బ్రహ్మంగారి మఠం మండల ఎమ్మార్పీఎస్ కన్వీనర్ ఎర్రంపల్లె జ్ఞానేశ్వర్ రావు మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పలుగురాళ్ల పల్లె నుండి అత్యవసర పరిస్థితుల్లో, మరే ఇతర కారణాలతో బ్రహ్మంగారి మఠం చేరాలంటే చుట్టూ 15కిలోమీటర్లు తిరిగి వచ్చేవారని, దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి కాలంలో పలుగురాళ్ల పల్లె నుండి తోట్లపల్లె మీదుగా రహదారిని ఏర్పాటుచేయడం జరిగిందని, ఈ రహదారి గుండా అరగంటలోనే మఠం చేరుకునేం దుకు వీలుగా ఉందని, అయితే పాపిరెడ్డిపల్లె సమీపంలో ఉన్న కాలువకు బ్రిడ్జి నిర్మించడంలో జాప్యం చేయడం వల్ల ఇప్పటికి ప్రలు కాలువ దాటుకోవడం ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వర్షం వస్తే ఈ కాలువ మీదుగా ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. కేటాయించిన నిధులతో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని సోమిరెడ్డిపల్లె బ్రిడ్జి, చౌదరవారిపల్లె బ్రిడ్జిలు పూర్తి అయ్యే విధంగా ఇప్పటికైన అధికారులు, రాజకీయ నాయకులు స్పందించి ఈ కాల్వపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని విన్నవించారు.

ప్రవీణ్ కుమార్ రెడ్డిపై కేసులను ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర కమలాపురం : ప్రొద్దుటూరు నియోజక వర్గ టీడీపీ ఇంచార్జ్ గండ్లూరు ప్రవీణ్ కుమార్ రెడ్డి పై ప్రొద్దుటూరు పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులను భేషరతుగా ఉపసంహరించుకోవాలని తెలుగునాడు ప్రజాసేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి కాశీభట్ల సత్య సాయినాథ్ శర్మ డిమాండ్ చేసారు. హై కోర్టు ఉత్తర్వుల మేరకు ప్రొద్దుటూరుకు వెళ్లకుండా కమలాపురం మండలం కోకటం గ్రామంలో ఉన్న ప్రవీణ్ కుమార్ రెడ్డిని ఆదివారం మధ్యాహ్నాం సాయినాథ్ శర్మ తన అనుచరులతో కలసి పరామర్శించారు. విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి తన అసమర్థతను కప్పి పుచ్చుకోవడానికి ప్రవీణ్ కుమార్ రెడ్డి పై తప్పుడు కేసులు పెట్టిస్తూ పోలీసులను అడ్డుపెట్టుకొని బెదిరించడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తామందరం వ్యక్తిగతంగా ప్రవీణ్ కుమార్ రెడ్డి కి సంపూర్ణ మద్దతు ప్రకటించా మన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు రాజేంద్ర రెడ్డి, నాగేంద్ర రెడ్డి, ఎల్ వి రామముని రెడ్డి, పెండ్లిమర్రి అంకిరెడ్డి, దామోదర్ రెడ్డి, శివరామిరెడ్డి, పెద్దచెప్పలి ఎంపిటిసి నాగరాజ ఆచారి, మాజీ సర్పంచ్ హరిత సుధాకర్, కొండాయపల్లె సర్పంచ్ భవాని సుధాకర్, బిసి సంఘ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టణ వైసీపీ అధ్యక్షుని జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-జమ్మలమడుగు: జమ్మలమడుగు పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. టపాసులు పేల్చి ,కేక్ లు కట్ చేసి,పలువురు పట్టణ అధ్యక్షునికి ఈ సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ సింగరయ్య ,వేపరాల ఎంపీటీసీ కుమార్, గూడెం చెరువు గ్రామానికి చెందిన శివారెడ్డి, ప్రవీణ్ కుమార్ ,భాష తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-కమలాపురం : స్థానిక గ్రంథాలయ శాఖలో 55వ గ్రంథలయం వారోత్సవాలలో భాగంగా ఈ నేడు ప్రారంభం నుంచిఈ 20వ తేది వరకు శాఖ గ్రంథాలయం నందు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శాఖ అధికారిని నాలాంజలి దేవి ఆదివారం ఓ ప్రకటన తెలియజేస్తూ నేడు బాలల దినోత్సవం పురస్కరించుకొని నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించడంతో పాటు 15వ తేది పుస్తక ప్రదర్శన, 16వ తేది గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకోవడం, 17వ తేది చిత్ర లేఖనం, వ్యాస రచన పోటీలు 18వ తేది సెమినార్స్, క్విజ్ పోటీలు, 19వ తేది మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఇందిరా గాంధీ పటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరుగుతుంది,దిశ చట్టంపై అవగాహన 20వ తేది పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానోత్సవంతో వారోత్సవాలు ముగింపు వేడుకలు నిర్వహించడం జరుగుతుంది ఆమె అందులో పేర్కొన్నారు.

నిరాదరణ ఆరోపణలు చేయడం తగదు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : మా వ్యాపార కార్యకలాపాలపై నిరాధారణ ఆరోపణలు చేయడం తగదని భావన టౌన్ షిప్, బుద్ధ ఇన్ ఫ్రా ప్రాజెక్టు పార్టనర్స్ గుమ్మా రాజేంద్రప్రసాద్ రెడ్డి, గుమ్మా నాగిరెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా కడప నగరంలో వైయస్సార్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియాప్రతినిధుల సమావేశంలో వారు మాట్లాడారు. భావన టౌన్ షిప్, బుద్ధ ఇన్ ఫ్రా ప్రాజెక్టుకు సంబంధించి తాము వ్యాపారాలు కొనసాగిస్తున్నామన్నారు. మా సంస్థకు సంబం ధించి అన్ని చట్టపరమైన అనుమతులతో, చట్టంలో తెలియపరిచిన నిబంధనలకు లోబడి జిల్లా సర్వోన్నతాధికారి అయిన కలెక్టర్ చే ఆర్డర్ చేయబడిన భూములను మాత్రమే తాము కొనుగోలు చేయడం జరిగిందన్నారు. తాను ఇప్పటివరకు 27.27 ఎకరాలు మాత్రమే కొనుగోలు చేశామన్నారు. అందులో సుమారు 22 ఎకరాల భూమిని మాత్రమే డీటీసీబీ అప్రూవల్ కోసం ముందుకు వెళ్లడం జరిగిందన్నారు. మిగతా భూమిలో ఎలాంటి పాట్లు వేయడంగానీ, విక్రయించడం గానీ జరగడం లేదన్నారు. అన్ని చట్టపరమైన హక్కులతో తాము భూమి కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తించాలన్నారు. ఈ విషయంగా కొన్ని మీడియా సంస్థల ద్వారా వక్రీకరించడం జరిగిందన్నారు. ఇక రోడ్డు విషయంగా రోడ్లు భవనాలశాఖ అధికారుల అనుమతులు పొందిన తర్వాత ప్రజల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. ఈ విషయంగా కొంతమంది అవాస్తవాలను ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. మేము చేస్తున్న వ్యాపారులపై దుశ్రప్రచారం చేయడం మానుకోవాలన్నారు. ఏవైనా అనుమానాలు ఉంటే కలెక్టర్, ఆర్డిఓ, ఎమ్మార్వోలను కలిసి తెలుసుకోవాలని తెలిపారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు, తప్పుడు మాటలు మాట్లాడడం తగదన్నారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ రాష్ట్ర బోర్డు కార్పొరేషన్ చైర్మన్ పులి సునీల్ కుమార్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు యథాతథంగా "స్పందన": కలెక్టర్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈ సోమవారం "స్పందన" అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వి.విజయ్‌రామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా.. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని (పరిష్కారం కానట్లు స్పందన అర్జీల రసీదు కలిగిన) అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న లేపాక్షి చైర్ పర్సన్

విశాలాంధ్ర-జమ్మలమడుగు రూరల్ : వైయస్ ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు మండలం మొరగుడి గ్రామములో శ్రీ చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల ఉత్సవాల సందర్భంగా చౌడేశ్వరి అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్ పర్సన్ బడిగించల విజయలక్ష్మి. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆమెకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో చేనేత సమస్యల పరిష్కార కమిటీ మాజీ సభ్యులు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రమౌళి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : చిత్తా రవిప్రకాష్ రెడ్డి పర్యవేక్షణ లో బ్రయాన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో దంత వైద్య సేవల విభాగం ప్రారంభించారు. చిల్డ్రన్స్ డే సందర్భంగా వైద్య శిబిరంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా పరీక్ష నిర్వహించి మందులతో పాటు డెంటల్ కిట్ ఉచితంగా అందజేశారు. ఎలిచెర్ల సాయినాథ్ రెడ్డి, శోభిత రెడ్డి, ఎలిచెర్ల నిహారిక రెడ్డి పాల్గొన్న ఈ ఉచిత దంత వైద్య శిబిరంలో రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ బద్వేల్ శ్రీ సాయి దంత వైద్యశాల వైద్యులు ప్రతి ఆది, బుధ, శుక్రవారంలలో మదర్ థెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న బ్రయాన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు తమ సేవలను అందిస్తారని వీరంతా వివిధ విభాగాలలో ఎండిఎస్ చేసిన వైద్యులని వీరి సేవలను పోరుమామిళ్ల చుట్టుపక్క ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే అవకాశం కల్పిస్తున్నామని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గం యువ నాయకుడు చిత్తా గిరి ప్రణీత్ రెడ్డి, ప్రజల రెడ్డి, ఆరోగ్యరాణి, చిత్తా రాజరెడ్డి మాజీ ఎంపిటిసి రోసిలీనా తదితరులు పాల్గొన్నారు.

కమ్మ సంక్షేమ సంఘం అభివృద్ధికి పాటుపడతాం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కమ్మ సంక్షేమ సంఘం అభివృద్ధికి పాటు పడుతానని ఆ సంఘం అధ్యక్షులు దొడ్డపనేని చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న బిల్డింగును పూర్తి చేస్తామని మాట ఇచ్చారు. ఆదివారం కడప నగరంలోని స్థానిక కమ్మ సంక్షేమ సంఘం కార్యాలయంలో కడప జిల్లా కమ్మ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులుగా దొడ్డపునేని చంద్రశేఖర్ నాయుడు ను ఎన్నుకున్నారు. వారం రోజుల్లో మిగిలిన బాడీని ఎన్నుకుంటు న్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దొడ్డపనేని చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ కమ్మ కులస్తులు విద్యా పరంగా, ఆర్థిక పరంగా, వైద్య పరంగా ఎదుగుదలకు కృషి చేస్తామన్నారు. ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి తగు ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. కమ్మ సంక్షేమ హాల్ ను అద్దెకు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు నాయుడు, జి.తిరుమల నాయుడు, కిషోర్ చౌదరి, హరి నాయుడు, వెంకటరమణ నాయుడు, సుబ్బరాయుడు సురేంద్రబాబు కమ్మ సంక్షేమ సంగం నాయకులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలకు ఏర్పాట్లు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పెద్ద చెరువు కట్టపై ఉన్న భైరవ స్వామి గుడి ప్రాంతంలో కార్తీక వనభోజనాల కోసం గుడి ప్రాంతంలో ప్రజలందరూ సులభంగా వచ్చి పవిత్రమైన భైరవ స్వామిని దర్శించుకుని కార్తీక వనభోజనాల్లో పాల్గొనడం కోసం సర్పంచ్ సుధాకర్ నాయుడు తన సొంత నిధులతో అక్కడికి వెళ్లడానికి దారి వాహనాల పార్కింగ్ కోసం జెసిబి వాహనాలతో స్థలాన్ని శుభ్రం చేయించారు. కలసపాడు, కాశినాయన, బి.కోడూరు, మండలాల్లోని బలిజ సంఘం తరపున చందాలు పోగేసి కార్తీక వన వాస భోజనాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 20వ తేదీన వనభోజనాన్ని ఏర్పాటు చేసినట్లు బలిజ సంఘం నాయకులు పేర్కొన్నారు. కార్తీక మాస వనభోజనాల్లో ప్రతి ఒక్కరు పాల్గొని భైరవ స్వామి ఆశీస్సులు పొందాలని బలిజ సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం బద్వేల్ నియోజకవర్గ అధ్యక్షులు రుద్రా శ్రీకాంత్ రాయల్, సిపిఎం నగిరి భైరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అన్నమయ్య జిల్లా



పేదల గడప వద్దకే సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: జగన్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలే పేదల్ని వెతుక్కుంటూ వారి తలుపు తడుతున్నాయని వైఎస్ఆర్ సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్య, ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాయచోటి రూరల్ మండల పరిధిలోని మాధవరం 2వ సచివాలయ పరిధిలో ఉదయం 6.30 గంటలకే కార్య క్రమాన్ని ప్రారంభిం చారు.కాలువపల్లె, బండక్రింద పల్లె, మల్లెంవాండ్లపల్లె, మూల తమటం వాండ్లపల్లె, ఇర్రివాండ్లపల్లె, గురికాని వాండ్లపల్లె,మద్దివాండ్లపల్లె, పేయల వాండ్లపల్లె,టమటంవాండ్లపల్లె, లలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. గడప గడప కు శ్రీకాంత్ రెడ్డి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభి వృద్ధి పథకాలును వివరిస్తూ, సమస్యలుపై ఆరా తీసి వాటి పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. శ్రీకాంత్ రెడ్డి పల్లె ప్రజలను ఆప్యాయతా, ప్రేమానురాగాలుతో పల్లె ప్రజలను పలకరిస్తూ. సమస్యల పరిష్కారంపై బిడ్డలా, సోదరునిలా చొరవ చూపుతూ, అర్హత ఉండి పథకాలు అందనివారికి పథకాలు వర్తించేలా అధికారులు, సిబ్బందికి దిశ నిర్దేశం చేస్తూ, గ్రామ ప్రజలే తోడుగా, అధికారులు వెంటరాగా గడప గడపను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి,జెడ్ పి టి సి వెంకటేశ్వర రెడ్డి,మండల బిసి నాయకులు పల్లపు రమేష్, ఈ ఓ పి ఆర్ డి సురేష్, దివాన్, గంగిరెడ్డి, రమేష్ రెడ్డి, కసిరెడ్డి వెంకట నరసింహా రెడ్డి, జయరామిరెడ్డి, రామమోహన్ రెడ్డి, విశ్వనాథ నాయుడు, చంద్రశేఖర్ నాయుడు, పెద్దినాయుడు, రామ్మోహన్ నాయుడు,గంగయ్య నాయుడు, రఘురామిరెడ్డి, శివారెడ్డి, లింగారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, బాబురెడ్డి, గౌస్ పీర్,గౌస్ అలీ, పఠాన్ అల్లా బక్ష్, పాపా, రామసుబ్బారెడ్డి, రెడ్డెప్ప, నారాయణ రెడ్డి, రాజా, జాఫర్ హుసేన్ పాల్గొన్నారు.

ఇదెక్కడి న్యాయం

తప్పు చేసింది ఒకరు బలి పశువు అయింది మరొకరు - భూ కబ్జాల వ్యవహారంలో ఉన్నతాధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు - ఈదరపల్లెలోనూ భూమాయ

'ఎవరో జ్వాలను రగిలించారు మరెవరో దానికి బలయ్యారు' అనే సినీ గేయ రచయిత వ్రాసిన ఈ అర్థవంతమైన పాటను నిజం చేస్తూ నందలూరు మండలంలో జరిగిన భూ కబ్జాలో పెద్దల పాత్ర వుండగా, వారిని వదిలేసి సంబంధం లేని దిగువ శ్రేణి అధికారులపై చర్యలు తీసుకోవడం ఇందుకు ఉదాహరణగా మారింది.

విశాలాంధ్ర-నందలూరు : నందలూరు మండలంలో భూ కబ్జాల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారి, గత కొద్ది రోజులుగా అధికార పార్టీలో వర్గ విభేదాలు తారాస్థాయికి చేరి ఒకరిపైఒకరు విమర్శలు గుప్పించుకోవడం తెలిసిన విషయమే. అయితే ఈ విభేదాలు తారాస్థాయికి చేరడంతో గుట్టుగా కాజేసిన డికెటి భూముల వ్యవహారం బట్టబయలు అయిన విషయం విదితమే. దీనితో ఎవరెంత భూమిని మింగారో అన్న విషయాలు ఊహించని విధంగా వెలుగులోకి రావడం గమనార్హం. మండలంలోని పల్లె ప్రాంతాలలో వున్న ప్రభుత్వ భూములను చాలా కాలంగా ఎవరు అధికారంలో వుంటే వారు, వారి తగ్గ స్థాయిలో మింగేసిన విషయం తెలిసిందే. అయితే ఇటీవల కాలంలో ఖరీదైన భూములపై కూడా కన్ను పడడం, అధికారపార్టీలో వర్గాలు ఏర్పడడంతో ఈ భూముల వ్యవహారం వెలుగులోకి వచ్చాయి. ఆల్విన్ ఫ్యాక్టరీ సమీపంలోని సబ్‌స్టేషన్ సమీపంలో గల లక్షలాది రూపాయలు విలువ చేసే మూడున్నర ఎకరాలు భూమిని కొందరు దర్జాగా చదును చేసి, కబ్జా చేసేందుకు యత్నించడంతో మరో వర్గం అడ్డు పడిరది. దీనితో రెండు వర్గాల మధ్య సాగిన భూ ఒప్పంద వ్యవహారం ఇంకో వర్గానికి తెలియడంతో వారు భూ కబ్జాలను బట్టబయలు చేశారు. దీనితో అసలు వ్యవహారం వెలుగులోకి రావడం జరిగింది. చాలాకాలంగా డికెటి భూములు మింగేసిన విషయం పక్కన పెడితే ఇటీవల జరిగిన భూ కబ్జాల వ్యవహారం అధికార పార్టీ నేతల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. కాగా ఈ భూ కబ్జాల వ్యవహారంలో తప్పు చేసింది కొందరైతే పై స్థాయి అధికారులు మరి కొందరిని బలి పశువులు చేయడం గమనార్హం. ఈ భూ కబ్జాల వ్యవహారంలో చక్రం తిప్పిన వీఆర్‌వోతో పాటు పై స్థాయి అధికారులపై చర్యలు తీసుకోకుండా ఇంకో వీఆర్‌వోను సస్పెండ్ చేయడంపై ప్రజలు ఘాటుగానే స్పందిస్తున్నారు. తప్పు చేసిన వీఆర్‌వోను పక్కన పెట్టి ఇంకో వీఆర్‌వోపై చర్యలు ఎలా తీసుకుంటారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదిలావుండగా ఈ భూ కబ్జా వ్యవహారంలో ఓ మండల స్థాయి అధికారికి భారీ మొత్తంలోనే నగదు ముట్టినట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ప్రస్తుతం నందలూరు మండలంలో అధికార పార్టీలో రెండు ప్రధాన వర్గాలు వుండగా, ఒక వర్గంలోనే రెండు మూడు వర్గాలు తయారు కావడం విశేషం. దీనితో ఎక్కడ ఏమి జరిగినా ఆ విషయాలన్నీ ఇంట్లో వాడు పెట్టగా కంట్లో పుల్ల అన్న చందంగా వ్యవహారాలన్నీ బట్టబయలు అవుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ కబ్జాలకు గురైన భూములపై చర్యలు తీసుకునే దమ్ము అధికారులకు వుందా? అని ప్రజలు బహిరంగంగానే ప్రశ్నిస్తుండడం విశేషం. ఏదిఏమైనప్పటికీ ఈ భూ కబ్జాల వ్యవహారంలో ఎవరిది ఎంత పాత్ర వుందో రెవెన్యూ శాఖలో విచారణ జరిపి కఠినమైన చర్యలు తీసుకుంటే తప్ప కబ్జాలకు అడ్డుకట్ట పడే అవకాశాలు కనబడడం లేదు. తాజాగా నందలూరు గ్రామ పంచాయితీలోని ఈదరపల్లె గ్రామంలో కూడా దాదాపు 30 ఎకరాలు ఓ మాజీ సర్పంచ్, మరో నాయకుడు కలిసి పంచుకున్నట్లు సమాచారం.

సమయానికి రాని ఆర్టీసీ బస్సులు అవస్థలు పడుతున్న విద్యార్థులు

విశాలాంధ్ర - పెద్దమండ్యం : మండలంలో బస్సులు సమయానికి రాకపోవడం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కాని ఆర్టీసీ యాజమాన్యం పట్టించుకొన్న పాపాన పోలేదు,అనేక సార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. చూస్తామని సమాధానం తప్ప వేరే విధంగా చర్యలు తీజుకోలేదన్నారు.దీంతో విద్యార్థులు సకాలంలో పాఠశాలలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థుల తల్లి తండ్రులు మరియు సకాలంలో విద్యార్థులు రాక ఉపాధ్యాయులు సమయానికి రాని బస్సుల వల్ల అందరూ ఇబ్బందులు పడుతున్నా,అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఒకేసారి రెండు లేదా మూడు బస్సులు వస్తాయి, లేకపోతే రెండు గంటలైన బస్సులు రాకపోవడం గమనార్హం.ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలలో సందర్శించి సమయానికి బస్సులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చిన్నపాటి వర్షానికి జలమయమైన రోడ్లు

విశాలాంధ్ర-చిట్వేలి : మండలంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు జలమయ మయుతున్నాయి. పట్టణంలోని శింగనమల వీధిలో వర్షానికి రోడ్డు బురదమయం కావడంతో పాదచారులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు బురద మయం కావడం రోడ్డు కనపడక కారు బుదదలో కూరుకుపోయింది. స్థానికుల సహాయంతో కారును సురక్షితంగా బయటికి లాగడం జరిగింది. అలాగే బ్రాహ్మణ వీధిలో రోడ్డు బురద మయం అయింది. దీంతో పాదాచారులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌళిక సదుపాయాలేవి

విశాలాంధ్ర-పీలేరు: జగనన్న ఇల్లు - పేదల పాలిట కన్నీళ్లు " కార్యక్రమం లో భాగంగా పీలేరు మండలం నందు జనసేన జిల్లా కార్యదర్శి కలప రవి, జనసేన పీలేరు మండల అధ్యక్షులు వల్లెపు మోహన కృష్ణ, గురు మోహన్, పవన్ కుమార్, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలప రవి మాట్లాడుతూ, పేదలకు ఇచ్చిన ఇండ్లకి సత్వరమే మౌళిక సదుపాయాలు కల్పించాలని, వెంటనే బకాయిలు చెల్లించి పేదలనిఅదుకోవాలని అన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-కెవిపల్లి: గ్యారంపల్లి కొత్తపల్లి వద్ద సూర్యప్రకాష్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మిన్నం రెడ్డి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు 70 మంది రోగులకు వైద్యులకు కుప్పుస్వామి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో గ్యారంపల్లి సర్పంచ్ రెడ్డప్ప ఎంపీటీసీ సూర్యనారాయణ రెడ్డి పీలేరు ఎంపీటీసీ నర్సింహారెడ్డి దండు వెంకట రమణారెడ్డి రెడ్డి, బాలకృష్ణారెడ్డి సునంద కుమారి ప్రజలు పాల్గొన్నారు.

చర్మ వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు

విశాలాంధ్ర-పీలేరు: చర్మ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం తగదని డాక్టర్ ఏ. శ్వేతా రాణి, డాక్టర్ కె. చైతన్యా రెడ్డి తెలిపారు. ఆదివారం పీలేరు పట్టణంలోని తిరుపతి రోడ్డులోని శ్రీచక్ర హాస్పిటల్లో చర్మ వ్యాధులకు, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న 250 మందికి ఉచిత వైద్యంతో పాటు మందులు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ సందీప్ కుమార్, నిర్వాహకులు నాగేంద్ర నాయుడు, వైద్య సిబ్బంది నరేష్, లక్ష్మీషసన్న, లక్ష్మి, తులసి పాల్గొన్నారు.

15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

విశాలాంధ్ర -రాజంపేట:అన్నమయ్య జిల్లా రాజంపేట పరిధిలో రెండు ప్రాంతాల్లో 15ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఎస్పీ మేడా సుందరరావు ఆదేశాల మేరకు రిజర్వు ఇన్‌స్పెక్టర్ అలీబాషాకు చెందిన రెండు టీమ్ లు ఎస్ఆర్ పాళ్యం సెక్షన్ లోని రోళ్ల మడుగు బీట్ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. ఆదివారం తెల్లవారుజామున ఒక టీమ్ కు కుమారపెంట వద్ద కొందరు వ్యక్తులు ఎర్రదుంగలు మోసుకుని వెళుతూ కనిపించారన్నారు. వీరిని చుట్టుముట్టే లోపు దుంగలను పడేసి పారిపోయారన్నారు. ఆ ప్రాంతంలో ఏడు ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. మరో టీమ్ చిన్నకోన అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తుండగా, ఎనిమిది ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. వీటిని స్వాధీనం చేసుకుని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ లో కేసులు నమోదు చేశామన్నారు. పట్టుబడిన ఎర్రచనం దుంగలు విలువ సుమారు రూ.30లక్షల వరకు ఉంటుందన్నారు.

రమేష్ రెడ్డిపై అక్రమకేసులు ఎత్తివేయాలి

విశాలాంధ్ర-గాలివీడు : మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి పై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని మాజీ ఎంపీపీ వెంకట నారాయణ రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం స్థానిక ఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో మండల టీడీపి నాయుకులు సమావేశమై రమేష్ రెడ్డి పై పెట్టిన కేసులను వారు మూకుమ్మడిగా ఖండించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ ఆర్ కుటుంబం అజాత శత్రువులు గా పేరుగాంచారని అలాంటి వారిపై నిందారోపణలు చేయడం సరికాదన్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే సొంతభూములను మైనార్టీ మసీదుకు అందజేసింది జగమెరిగిన సత్యమే నన్నారు. ప్రస్తుత.శాసనసభ్యులపై గతంలో ఉన్న బాంబుల కేసు సైతం దివంగత మాజీ మంత్రి రాజగోపాల్ రెడ్డి తొలగించడం శ్రీకాంత్ రెడ్డికి గుర్తుకు లేకపోవడం బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్థసారథి రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, మాజీ సర్పంచులు.మహమ్మద్ రియాజ్, చిన్నపరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, భద్రప్ప నాయుడు,గిరిజన నాయుకులు మిట్టే నాయక్ ,మాజీ వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ మహబూబ్ బాష, టీడీపి నాయుకులు రామచంద్రా రెడ్డి, వీర రాఘవులు, కదిరి నాయుడు,రామంజులు రెడ్డి ,వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాటకొండ హర్షవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - మదనపల్లె : తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రాటకొండ హర్షవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. నిమ్మనపల్లి సర్కిల్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి టిడిపి నాయకులు,కార్యకర్తలు హర్షవర్ధన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆర్.జె.వెంకటేష్ మాట్లాడుతూ రాటకొండ కుటుంబానికి మదనపల్లి నియోజకవర్గం ప్రజలతో ఎంతో అనుబంధం ఉందన్నారు. అటువంటి కుటుంబం నుంచి వచ్చి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో యువ నాయకుడు హర్షవర్ధన్ రెడ్డి చురుగ్గా పాల్గొంటున్నారన్నారు. ఆయన సమర్థతను గుర్తించి పార్టీ అధినాయకత్వం రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధిగా నియమించడం జరిగిందన్నారు. అనునిత్యం ప్రజలతో మమేకమై ఉండే హర్షవర్ధన్ రెడ్డి భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు అలంకరించాలని,ఆ కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని,ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి,నాదెండ్ల అరుణ్ తేజ్, ప్రణవ్ రాయల్,టిడిపి నాయకులు పఠాన్ ఖాదర్ ఖాన్,పూల మురళి, సిద్ధారెడ్డి,విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ విడుదల

విశాలాంధ్ర - రామాపురం : నేటి నుంచి ప్రారంభం కానున్న గ్రంథాలయ వారో త్స వాల పోస్టర్ను మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. స్థానిక గ్రంథాలయ అధికారి సూర్యనారాయణరెడ్డి గ్రంథాలయ వారోత్సవాలకు ముఖ్య అతిథిగా రావాలంటూ మోహన్ రెడ్డిని ఆహ్వానించారు. గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం నుండి ప్రారంభమై ఆదివారంతో ముగియనున్నాయి. సోమవారం నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం 15వ తేదీన పుస్తక ప్రదర్శన 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న నాయకులను స్మరించడం 17న కవి సమ్మేళనం 18న విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహించడం 19న దిశా చట్టంపై అవగాహన కల్పించడం 24 డిజిటల్ లైబ్రరీల ఆవశ్యకతను గురించి తెలియజేయడం వంటి కార్యక్రమాలు చేయనున్నట్లు గ్రంథాలయ అధికారి తెలిపారు. స్థానికంగా ఉన్న విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వివిఎం పంజం శంకర్ రెడ్డి మృతి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మండలంలోని అనంతరాజుపేట తూర్పుపల్లికి చెందిన పంజం శంకర్ రెడ్డి(82) ఆకస్మికంగా ఆదివారం ఉదయం ఆకస్మికంగా మరణించారు.ఈయన అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి తండ్రి, శంకర్ రెడ్డి తిమ్మిశెట్టపల్లి పంచాయితీ విలేజ్ మునసబ్ (విఎం)గా 35 సంవత్సరాలు, కోడూరు ఈస్ట్, వెస్ట్, విఏఓ గా 12 సంవత్సరాలు మొత్తం 47 సంవత్సరాలు వివిధ హెూదాలలో పనిచేసి పేదలకు ఎనలేని సేవలు అందించారని పలువురు కొనియాడారు. శంకర్ రెడ్డి మృతి విషయం తెలుసుకున్న రాజంపేట పార్లమెంటు సభ్యులు లోక్‌సభ ఫ్లోర్ లీడర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఎపిఎండిసి సిపిఓ వెంకటరమణ, వైసిపి నాయకులు కార్యకర్తలు ధ్వజారెడ్డి, హేమనవర్మ, రత్నమ్మ, శివయ్య, శివసాయి, రాజేంద్ర, రాజగోపాల్, చంద్రశేఖర్, జనార్దన్ రాజు, మల్లికార్జున, శంకరయ్య, రాజేశ్వరి, ఆర్వీ రమణ, శివారెడ్డి, నాగరాజ, ఆంజనేయులు, రౌఫ్, రమణారెడ్డి, అరుణ, రంగారెడ్డి, తదితరులు వెళ్లి పార్థివ దేహం పై పూలమాలవేసి నివాళులు అర్పించారు.పంజం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.అనంతరాజుపేట తూర్పుపల్లి లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

స్కీం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర - రాజంపేట : వివిధ ప్రభుత్వ శాఖలు, పథకాల్లో పనిచేస్తున్న వారికి పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు.ఆదివారం రాజంపేట ఏరియా ఏఐటీయూసీ సమితి సమావేశం సికిందర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశానికి అతిథిగా హాజరైన సాంబశివ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో, పథకాల్లో పనిచేస్తున్న వారికి వేతనాలు పెంచకుండా, అరకొర వేతనాలు అమలు చేస్తూ వారి నుండి వెట్టి చాకిరి చేయించుకుంటు న్నారని ఆరోపించారు. సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి యం.ఎస్ రాయుడు, ఏఐటీయూసీ రాజంపేట పట్టణ కార్యదర్శి సికిందర్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కో కన్వీనర్ సరోజమ్మ, నాగేశ్వరరావు, రమేష్,యాదమ్మ,రాజు,శివయ్య, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన తెలుగు యువత నాయకులు

విశాలాంధ్ర - మదనపల్లె : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్,మదనపల్లి తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బావాజాన్,మదనపల్లి మైనారిటీ నాయకులు మహబూబ్ ఖాన్,బిసి నాయకులు శ్రీరాములు,కాపు నాయకులు ఆదినారాయణలు ఆదివారం మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ప్రస్తుతం వైకాపా విధానాలతో ప్రజలు విసిగిపోయారని,వారి వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూనే,తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని,క్షేత్రస్థాయిలో పర్యటించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు వారు తెలిపారు. అదేవిధంగా వచ్చే ఏడాది జనవరిలో తాను చేపట్టబోయే పాదయాత్రలో వాలంటీర్లుగా పాల్గొనాలని ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం తెలుగు యువత నాయకులు మాట్లాడు తూ వచ్చే శాసనసభ ఎన్నికలకు ఇప్పటినుంచే సమాయత్తమవుతా మని, పార్టీలోని అన్ని విభాగాలతో సమిష్టిగా పనిచేసి టిడిపి అఖండ విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తెలుగుదేశం పార్టీకి తిరుగుండదని,చంద్రబాబు నాయుడు మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు.

వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజల సిద్ధం

విశాలాంధ్ర - రామసముద్రం : వైకాపా ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని మదనపల్లి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీరామనేని జయరామ నాయుడు స్పష్టం చేశారు.ఆదివారం అయన రామసముద్రం మండలంలోని మానేవారిపల్లి,మాలేనత్తం పంచాయతీలలో పర్యటించారు. మానేవారిపల్లి పంచాయతీలోని నాగనపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్దరెడ్డెప్ప, కృష్ణమూర్తిల ఇంటిలో జరిగిన శుభకార్యంలో పాల్గొన్నారు.అనంతరం మాలేనత్తం గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డితో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేస్తే రైతులకు ఉరితాళ్లు వేసినట్లేనని పేర్కొన్నారు. సమీపంలో ఉన్న తమిళనాడు రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు మూడువేల రూపాయలు ఖర్చు చేస్తుంటే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తొమ్మిది వేల రూపాయలు ఖర్చు చేస్తామనడం ఎంతవరకు సబబని ప్రశ్నిం చారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి మండలం చీకలబైలు సర్పంచ్ ప్రభాకర్, కమ్మవారిపల్లె సర్పంచ్ వెంకటరమణ,రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటరమణ,రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యనిర్వ కార్యదర్శి శివశంకర్,కృష్ణమరాజు యాదవ్,చలపతి నాయుడు, డాక్టర్ శివ, ఇలియాజ్ బాషా,వెంకటరమణ, పెంచుపాడు స్వామి,మునుస్వామి రెడ్డి,నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేయాలి

విశాలాంధ్ర - వాల్మీకిపురం : రైతుల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేయాలని వాల్మీకిపురం ఆర్బికే చైర్మన్ నీళ్ల భాస్కర్,జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బోదేషావలి అన్నారు.స్థానిక వెలుగు కార్యాలయంలో ఆది వారం వాల్మీకిపురం, గుర్రంకొండ,కలకడ మండలాల ప్రకృతి వ్యవసాయ సం స్థల సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లా డుతూ వరి పంటకు నాలుగు రోజులకోసారి జీవామృతాన్ని పారించాలని ,ప్రకృతి వ్యవసా యాన్ని విస్తృతం చేయడంలో కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. ఈ కార్యక్రమంలో యశోదమ్మ, ఎంటీలు శ్రీనివాసులు, జ్యోతి,సిబ్బంది పెద్దరెడ్డప్ప, స్వాతి, హేమలత , రమేష్ కుమార్ రెడ్డి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - రాజంపేట: రాజమండ్రిలో ఈనెల 26, 27, 28 తేదీలలో జరిగే జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లాల సహాయ కార్యదర్శి గాలి చంద్ర, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్మెస్ రాయుడు అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఆర్ అండ్ బి బంగ్లా వద్ద భవన నిర్మాణ కార్మికులతో కలిసి గోడ పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నా కార్మిక వ్యతిరేఖ విదానాలను జాతియ మహాసభలలో ఎండగడదామన్నారు. అలాగే కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ శ్రమ కార్డు వల్ల పెద్ద ప్రయోజనాలు ఏమి కనిపించలేదన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుస్తామని చెప్పిన ప్రభుత్వాలు ఇవాల పెద్ద పెద్ద కంపెనీ లకు మాత్రం ప్రయోజ నాలే చేకూరుస్తున్నాయి అన్నారు. ఈ రాష్ట్రం కూడా భావన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. 2024 లో జరిగే ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా గౌరవాధ్యక్షులు వెంకటయ్య, మేస్త్రీ నన్నెసాహెబ్, బి మల్లికార్జున, నాగభూషణం, రాజు, జి రమణ, రంగస్వామి, బాలునాయక్ పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనారు.

పెద్దిరెడ్డి కుటుంబం చల్లగా వుండాలి: సర్పంచ్

విశాలాంధ్ర-పీలేరు: పెద్దిరెడ్డి కుటుంబం చల్లగా వుండాలని, కులా మతాలకు అతీతంగా ప్రాధ్యానతఇస్తు మరో 30 ఏండ్లు సీఎం జగనే వుండాలనిసౌదీదేశంలోని మక్కాఎదుటప్రార్ధించటం జరిగిందని, మక్కా నుంచి విశాలాంధ్రతో పీలేరు సర్పంచ్ హబీబ్ బాషాఈ సందర్భంగా చరవాణి ద్వారా మక్కా నుండి విశాలాంధ్రకు తెలిపారు. ఎందరికో కులమతాలకు అతీతంగా రాజకీయ చదరంగం లో మకుటం లేని మహారాజుగా, మనసున్న నాయకుడు గాప్రతి ఒక్కరిని ఆప్యాయంగాపలకరిస్తు తగినటువంటి ప్రాధాన్యతనుకల్పిస్తున్న ఏకైక నాయకుడు తమ రాజకీయ గురువు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, కుటుంభ సభ్యులనిఆయన వ్యాఖ్యానించారు.పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంతో పాటు పీలేరు శాసనస చింతల రామచంద్రారెడ్డి కుటుంబం వైసిపి నాయకుల కుటుంబాలు నియోజకవర్గప్రజలందరూ సుఖశాంతులతో అష్ట ఐశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో కలకాలం చల్లగా ఉండాలని మక్కా వద్ద ప్రార్ధించామని పీలేరు సర్పంచ్ హబీబ్ బాషా విశాలాంధ్రకు ప్రత్యేకంగా తెలిపారు.హబీబ్ బాషాతోపాటుఇందాదుల, మహబూబ్ బాషా,అమీనుల రషీద్,అష్రాఫ్ అలీ పాల్గొన్నారు.

టీడీపీకి కార్యకర్తలే పట్టుకొమ్మలు

విశాలాంధ్ర- కెవి.పల్లి: టీడీపీ పార్టీ కి కార్యకర్తలే పట్టుకొమ్మలని తెలుగుదేశం పార్టీ, జాతీయ ప్రధాన కార్యదర్శి,నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారంఆయన పలు కార్యక్రమాలలో పాల్గొని టీడీపీ ప్రభుత్వంలోఅనేకసంక్షేమ,ఫథకాలుతోపాటు గ్రామంలో పనులను ప్రజలకు వివరించాలన్నారు 2023లో పార్టీనిఅధికారంలోకి రావటాని కి, ప్రతికార్యకర్తకష్ట పడిపని చేయాలన్నారు ప్రజలకు గతంలో టీడీపీ చేపట్టిన త్రాగునీటీకొరకు చేప్పట్టిన ప్రాజేక్టులు, వీదిరోడ్లు,ఫింఛానది, వంతెన, ఝరీకోనప్రాజెక్టు, ఇంటీ నిర్మాణాలు, కళాకారులకు 3000 రూపాయల ఫించన్లు తెలియజేయాలని తెలిపారు.ఈకార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ రాజంపేట నియేజకవర్గం ప్రధానకార్యదర్శి కుప్పం రవిచంద్రారెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, యర్రంరెడ్డి,ధ్వారకనాధనాయుడు,రాజేశ్వరి గ్యాస్, యజమాని,చీనేపల్లి విశ్వనాధ, ఇంకా ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో అభివృద్ధి చెందాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ఐకమత్యంతో కలసికట్టుగా వుండి చైతన్యవంతులై అభివృద్ధి చెందాలని టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు, రాయచోటి టిడిపి నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని శ్రీవీరభద్ర స్వామి దేవస్థాన సమీపంలో వున్న కాకుమాని అబ్బేన్నశెట్టి కళ్యాణ మండపం నందు ఏర్పాటు చేసిన దొమ్మర కుల సంక్షేమ సంఘ ఆత్మీయ సమావేశానికి అయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో టిడిపి అధికారం లోకి రాగానే తమ డిమాండ్స్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దొమ్మర సంఘ అధ్యక్షులు రాజశేఖర్, వేణుగోపాల్, వెంకటేష్, గుర్రప్ప పాల్గొన్నారు.

అట్టహాసంగా నిరుడు కురిసిన వెన్నెల గ్రంథావిష్కరణ

విశాలాంధ్ర - మదనపల్లె : ప్రజా చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం మదనపల్లె పట్టణం జ్ఞానోదయ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో సుప్రసిద్ధ కథ, నవలా రచయిత, అనువాదకులు, బహుగ్రంథకర్త, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అయిన జిల్లేళ్ల బాలాజీ నూతన గ్రంథం నిరుడు కురిసిన వెన్నెల కథా సంపుటి గ్రంథావిష్కరణ గొల్లపూడి తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించారు. మదనపల్లె శాఖ గ్రంథాలయ సంస్థ అధికారి వసంత, కామకోటి ప్రసాదరావు సంయుక్తంగా గ్రంథావిష్కరణ చేశారు. జి.శ్రీధర్ తొలి ప్రతిని స్వీకరించారు. సభ అధ్యక్షత వహించిన టిఎస్‌పి కృష్ణమూర్తి కథానిక దాని పుట్టుపూర్వోత్తరాలు , ఆంధ్రదేశంలో తెలుగు కథ ప్రస్థానాన్ని గురించి వివరించారు. కామకోటి ప్రసాదరావు, జోలపాలెం భవానీ ప్రసాద్‌లు రచయితలు సాహిత్య అభివృద్ధికి చేస్తున్న కృషిని కొనియాడారు. అంజలి ఇండ్లూరి, బి.విజయలక్ష్మి సమాజ హిత కరమైన సాహిత్యాన్ని అధ్యయనం చేయవలసిన ఆవశ్యకత గురించి సభికులకు , పాఠశాల విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. గ్రంథ సమీక్షను డాక్టర్ వి.కనక సభాపతి, రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్, బెసెంట్ కాలేజ్ అద్భుతంగా విశ్లేషించారు. డాక్టర్ జ్ఞాని చంద్రశేఖర్ కథానిక స్వరూప స్వభావాలను గురించి వివరిస్తూ ప్రసంగించారు. గ్రంథ రచయిత జిల్లెళ్ళ బాలాజీ తమ జీవితానుభవాలను, రచనానుభవాలను చక్కటి వాగ్ధాటితో సభికులకు వివరించారు. కొడవటి ప్రభాకర్, మాదాసు రెడ్డెప్ప, ఎన్ శ్రీనివాసులు నాయుడు, ఆలూరి సురేష్, పండిత వాసా కృష్ణమూర్తి, అనిల్, జ్ఞానోదయ పాఠశాల ఉపాధ్యాయులు, సాహిత్య అభిమానులు పాల్గొన్న ఈ సభ ధర్మాధిపతి నాగభూషణరావు వందన సమర్పణతో ముగిసింది.

ఏపీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న మోడీ, జగన్: టీడీపీ

విశాలాంధ్ర - మదనపల్లె రూరల్ : ఏపీ ప్రజలను ముఖ్యమంత్రి జగన్, ప్రధాని మోడీలు తప్పుదోవ పట్టిస్తున్నారని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని నిమ్మనపల్లి సర్కిల్ లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మోడీ విశాఖ పర్యటన రాష్ట్ర ప్రజలను తీవ్రంగా నిరాశపరిచిందన్నారు. ముఖ్యంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని చేత చెప్పించడంలో సీఎం విఫలమయ్యారన్నారు. ప్రత్యేక హోదా అంశం ఊసే లేదన్నారు. తనకు ప్రధాని మోడీతో, కేంద్ర ప్రభుత్వంతో ఉన్న బంధం రాజకీయాలకతీతమైందని ముఖ్యమంత్రి చెప్పడం వెనుక ఉన్న ఉద్దేశ్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఆంధ్ర యూనివర్సిటీ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి తెలుగులో మాట్లాడితే మోడీ హిందీలో మాట్లాడడం జరిగిందని, ఈ నేపథ్యంలో ప్రధానికి రాష్ట్ర సమస్యలు ఏమి అర్థమై ఉంటా యన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ కేసులు మాఫీ కోసమే మోడీ ముందు మోకరిల్లుతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా జగన్ రాష్ట్ర విభజన అంశాలు, ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కుపై ప్రధాని మోడీని నిలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ నాయకులు పఠాన్ ఖాదర్ ఖాన్, మహిళా నాయకురాలు విజయమ్మ, తెలుగు యువత నాయకులు నాదెండ్ల అరుణ్ తేజ్, ప్రణవ్ రాయల్, బెస్త సంఘం నాయకులు మడితం రమణ, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

ఇంటికి చేరని ఇంటింటికి బియ్యం

- ఉపాధ్యాయులు చౌక దుకాణాలకు వెళ్లాల్సిందే
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర - రామసముద్రం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత పాలన పారదర్శకంగా ఉండాలంటూ పలు పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషిచేస్తున్నారు. అందులో భాగంగా ప్రతి ఇంటికి బియ్యం ఇంటి వద్దకే చేరాలని సంకల్పంతో ఇంటింటికి బియ్యం పథకం తీసుకొచ్చారు. అయితే ఇంటింటికి బియ్యం ఇంటికి చేరకుండా లబ్ధిదారులు వాహనాల వద్దకు వెళ్లే బియ్యం తీసుకునే పరిస్థితి ఏర్పడు తోంది. అంతే కాకుండా ప్రభుత్వం పాఠశాలలకు సరఫరా చేసే బియ్యం సైతం ఉపాధ్యాయులు చౌక దుకాణాలకు వెళ్లి తీసుకుని వెళ్లాల్సిందే. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలలకు బియ్యం ఇచ్చే సంచులను తిరిగి తమకు ఇస్తేనే బియ్యం ఇస్తామంటూ కొందరు డీలర్లు మెలిక పెడుతున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారంటూ ప్రజలు మండిపడుతున్నారు. రామసముద్రం మండలంలో ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక మోడల్ స్కూల్, ఒక కస్తూర్బా స్కూల్, 12 ప్రాథమికోన్నత, 62 ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు చదువు కుంటున్నారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థికి నూరు గ్రాములు, ఆపై చదివే విద్యార్థులకు 150 గ్రాములు రోజుకు ప్రభుత్వం బియ్యం సరఫరా చేస్తోంది. అయితే ఉపాధ్యాయులు తమ సొంత డబ్బుతో పాఠశాల బియ్యం ఆటోల ద్వారా స్కూళ్లకు చేరవేసుకుంటున్నారు. ప్రభుత్వం ఆశయం గొప్పదైన ఆచరణలో అధికారుల నిర్లక్ష్యం వల్ల పథకాలు పక్కదారి పడుతున్నాయని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తు న్నారు. ఇప్పటికైనా అన్నమయ్య కలెక్టర్ స్పందించి తగుచర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కార్తీక వనభోజనంతో ఐక్యతను చాటిన పద్మశాలిలు

విశాలాంధ్ర - మదనపల్లె రూరల్ : మదనపల్లి పట్టణం కదిరి రోడ్డు, అమ్మచెరువు మిట్ట నందు పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనభోజనం కార్యక్రమం ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం అనాధ కరమైన వాతా వరణంలో జరిగిన ఈకార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పద్మశాలీలు హాజరై ఐక్యతను చాటి చెప్పారు. ఆట పాటలతో సాగిన ఈ కార్యక్రమం సభ్యులు మధ్య ఆనందంగా కొనసాగింది. ఈ సంద ర్భంగా పద్మశాలి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు గుత్తికొండ త్యాగరాజు మాట్లా డుతూ పద్మ శాలీలు అందరూ జాతి శ్రేయస్సు, అభివృద్ధి కోసం సామాజికంగా ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలని పిలుపు నిచ్చారు. ఇందుకోసం తమ బలాన్ని, ఐక్యతను చాటుకొన్నప్పుడే అది సాధ్యమవుతుందన్నారు. ప్రతి యేటా ఇదేవిధంగా పద్మశాలీ కుటుంబ సభ్యులంతా కలసుకొని, అన్ని విషయాలు పరస్పరం చర్చించు కొని, అభివృద్ధికి ముందడుగు వేద్దామన్నారు. తమ విద్యా, ఉపాధి, సేవా రంగాలలో రానిస్తున్న జాతి ఆణిముత్యాలను గుర్తించి వారికి సన్మానం చేసి మరింతగా ప్రోత్సహించ డానికి ఈ కార్యక్రమం ఓ వేదిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి సంఘం అధ్యక్షులు సామల వెంకట సుబ్బయ్య, గుత్తి శ్రీరాములు, తిరువీధి మురహారి, ఆమంచి మురళి, గుత్తి రాజా, మంచి మధు, గుత్తి వేమనారయణ, ఆమంచి రెడ్డెప్ప, సుదా రెడ్డీశేకర్, చందా భాస్కర్, గుర్రం మురళీ కృష్ణ, జక్క రమేష్, గుర్రం ఆదెప్ప, శివ, పుత్తూరు చెంద్రశేఖర్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం- కార్లు ఢీ
-10 మందికి తీవ్రగాయాలు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: కడప -బెంగళూరు జాతీయ రహదారిపై కేశపురం

గ్రామపంచాయతీ రెడ్డివారిపల్లి క్రాస్ వద్ద ఒక ద్విచక్ర వాహనం రెండు కార్లు ఢీకొని పది మందికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై రామాంజనేయుడు తెలిపారు వివరాలు.... పడమటి కోన గ్రామపంచాయతీ చిన్నర్స్ పల్లె హరిజనవాడకు చెందిన పసల రవి రెడ్డివారిపల్లి హరిజనవాడలో భాగ్యలక్ష్మిని వివాహం చేసుకొని ఉన్నాడు వీరికి ముగ్గురు కుమార్తెలు నాగ చేతు రాణి, భవిత రాణి, శ్రీ విద్య పిల్లలు శని ఆదివారాలు కావడంతో తమ అమ్మమ్మ గారింటికి వచ్చారు అయితే పిల్లలు భార్యతో కలిసి ఐదుగురు ఒకే ద్విచక్ర వాహనంలో తమ మామ గారి పొలం వద్దకు వెళుతున్న తరుణంలో హరిజనవాడ నుండి జాతీయ రహదారిని దాటుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాలు గమనించకుండా రహదారిపై దూసుకు రావడంతో మదనపల్లి వైపు నుండి రాయచోటి వైపు వస్తున్న ఈ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నది అంతతో ఆగక కడప నుండి గుర్రంకొండ కు వెళ్తున్న మరో కారును ఢీకొనడంతో ఆ కారులోని మహమ్మద్ ఖాన్ మరియు ఢీకొన్న కార్ లోని నలుగురు వ్యక్తుల వీరు తెలియ రావాల్సి ఉంది మరియు ద్విచక్ర వాహనంలోని ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో వీరిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు ఇందులో ఒక చిన్నారి నాగ చైతు రాణి పరిస్థితి విషమంగా ఉండడంతో రాయచోటి ప్రభుత్వాసుపత్రి నుండి తిరుపతికి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జన్మదినమే బాలల దినోత్సవం

నేడు చాచా 133వ జయంతి



విశాలాంధ్ర -రాజంపేట : నవంబర్ 14 వచ్చింది.. బాలలకు బోలెడు సందడి తెచ్చింది. ఈ రోజంటే పిల్లలకు పండగ లాంటిది. నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా వేడుకలా జరుపుకొంటారు. బాలల దినోత్సవం అంటే.. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పుట్టిన రోజు. మరి ఆయన జన్మదినాన్ని చిల్డ్రన్స్ డే గా నిర్వహించుకోవడానికి బలమైన కారణం ఉంది. అంతేకాదు.. ప్రపంచ దేశాలన్నీ నవంబర్ 20న బాలల దినోత్సవం జరుపుకొంటాయి. కానీ, భారత్‌లో మాత్రం ఆరు రోజులు ముందుగానే దీన్ని నిర్వహించుకుంటారు. నేడు బాలల దినోత్సవం సందర్భంగా దీని వెనుక ఉన్న చరిత్ర, విశిష్టత మీ కోసం..మన దేశ మొట్టమొదటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ. దేశానికి ఎక్కువ కాలం ప్రధానిగా సేవలు అందించింది కూడా ఆయనే. బ్రిటిష్ పాలనలో చతికిలపడ్డ దేశాన్ని తనదైన దార్శనికత, ముందుచూపుతో పురోగతి దిశగా నడిపించారు. 1889 నవంబర్ 14న పుట్టిన నెహ్రూకు పిల్లలన్నా, గులాబీలన్నా అమితమైన ప్రేమ. నెహ్రూ ఎక్కడికెళ్లినా.. పిల్లలను వెతికి మరీ ఆప్యాయంగా పలకరించే వారు. వారికి కానుకలను ఇచ్చి ఉత్సాహపరిచేవారు. ప్రధాని కాకముందు స్వతంత్ర పోరాటంలో భాగంగా ఆయన పలుమార్లు జైలు జీవితం అనుభవించారు. పిల్లలంటే ఎంతో ఇష్టమైన నెహ్రూకు తన కుమార్తె ఇందిర అంటే ఎనలేని అభిమానం. అందుకే ఆయన జైలు గోడల మధ్య నుంచి ఆమెకు అనేక ఉత్తరాలు రాసేవారు. స్వతహాగా రచయిత అయిన నెహ్రూ తన కుమార్తెకు రాసిన ఉత్తరాల్లో బోలెడు మంచి సంగతులు చెప్పేవారు. పిల్లలు ఎలా ఉండాలి? ఎలాంటి విషయాలు నేర్చుకోవాలి? సమాజంలో మంచి, చెడులను ఎలా గ్రహించాలి? సమస్య లను ఎలా అధిగ మించాలి తదితర అం శా లను కూలం కషంగా వివరించే వారు. నెహ్రూ నింపిన ఉత్సాహం, ధైర్యంతోనే ఇందిర ఉక్కు మహిళ గా రూపొందారు. ప్రధానిగా సాహసో పేతమైన నిర్ణయాలు తీసుకొని దేశాన్ని ముందుకు నడిపారు. తన కుమార్తె ఇందిరకు నెహ్రూ రాసిన ఉత్తరాలు నేటి తరానికి పాఠాల య్యాయి. ఆయన చెప్పిన ఆ మంచి మాటలు మనం ఎప్పటికీ ఆచరించదగినవే. పిల్లలకు కూడా పండిట్ నెహ్రూ అంటే వల్లమానిన ప్రేమ. ఆయణ్ని ముద్దుగా చాచా నెహ్రూ, చాచాజీ అని పిలుచుకుంటారు. ఇష్టమైన మేనమామ, బాబాయి అని దీని అర్థం. 1964లో నెహ్రూ మరణించిన తర్వాత ఆయన పుట్టిన రోజును బాలల దినోత్సవం గా నిర్వహించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. నాటి నుంచి నవంబర్ 14ను చిల్డ్రన్స్ డే గా జరుపుకొంటున్నాం.

24 నుంచి శ్రీ అభయాంజనేయ సమూహ దేవాలయ వార్షికోత్సవాలు

విశాలాంధ్ర - వాల్మీకిపురం : వాల్మీకిపురం పొలిమేరలో వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాం జనేయ సమూహ దేవాలయ ధర్మపథం ప్రథమ వార్షికోత్సవాలను ఈనెల 24 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు శిరిడి సాయి సాలిగ్రామ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, వేద పండితులు శ్రీనివాసాచార్యులు ఆదివారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా తిరుపతికి చెందిన మన సంస్కృతి కళా సంస్థ ఆధ్వర్యంలో 26న శనివారం ఉదయం 108 భక్తి గీతాల స్వరాలహరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన ఉత్సాహవంతులైన గాయకులు 9618489171 మొబైల్ నెంబర్ ద్వారా ముందుగా తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని నిర్వాహకులు మన సంస్కృతి కళా సంస్థ ప్రధాన కార్యదర్శి కలకట రెడ్డప్ప తెలిపారు.

2024 లో టిడిపి సత్తా చాటాలి

టిడిపి నేతలతో దశాదిశా నిర్దేశం చేసిన నల్లారి కిషోర్

విశాలాంధ్ర-పీలేరు: 2024లోరాష్ట్రంలోటిడిపి అధికారంలోకి రావడం ఖాయమని అలాగే పీలేరు నియోజకవర్గంలో 2024లో టిడిపి సత్తా ఏంటో చాటాలని చాటి చెప్పాలని చూపించాలని టిడిపి నాయకులు నేతలు, కార్యకర్తలకు దశ దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం పీలేరు ఎస్ ఎస్ వి ఎస్ కళ్యాణమండపం లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గం ఇంచార్జ్ నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. పీలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాలలో టిడిపి సైనికులు కార్యకర్తలు, ప్రతి ఒక్కరు కలిసికట్టుగా వైసీపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలగురించి క్షుణ్ణంగా వివరించి టిడిపి గెలుపుకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. టిడిపి ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతమే లక్ష్యంగా చేసుకుని గెలుపే ధ్యేయంగా ముందుకు సాగాలని టిడిపి నాయకులకు కార్యకర్తలకు ఆయన ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్ రెడ్డిని ఎదుర్కొనే ధైర్యం లేకే ఎస్సీ ఎస్టీ అక్రమ కేసులు: టీడీపీ

విశాలాంధ్ర-రామాపురం : ఎమ్మెల్యే రాయచోటి టీడీపీ ఇంచార్జ్ రమేష్ కుమార్ రెడ్డికి రాజకీయ జీవితంలో మచ్చలేని వ్యక్తి రమేష్ రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఎదుర్కొనే ధైర్యం లేక ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు మాజీ ఎమ్మెల్యే రమేష్ రెడ్డి పై బనాయించడం నీతి మాలిన చర్య అని అన్నారు. లక్కిరెడ్డిపల్లి మండలం ముద్దిరేవుల గ్రామం కొత్త మాదిగ పల్లె నందు ఎన్నో సంవత్సరాలుగా హరిజనులు సాగు చేసుకుంటున్న భూమిని దాని పక్కన ఉన్న భూమి కి చెందిన వైసిపి కార్యకర్తలు హరిజనులు సాగు చేసుకుంటున్నా భూమిలోకి చొరబడి వారిపై దౌర్జన్యం చేసి వారి తలలు పగలగొడితే మాజీ ఎమ్మెల్యే రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ రమేష్ రెడ్డి ఈ భూమి ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నా హరిజనులకు చెందినది అని ప్రజాప్రతినిధిగా సర్ది చెబితే స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఇదే ఆసరా చేసుకుని పక్కన ఉన్న భూమి వారిని ఉసిగొలిపి రమేష్ రెడ్డి పై ఎస్సీ ఎస్టీ కేసు బనాయించడం ఎంతటి దుర్మార్గపు చర్య అన్నది స్పష్టంగా కనబడుతున్నది. పోలీసు వారి సహకారంతో ఎమ్మెల్యేఇలా ప్రవర్తించడం ఆయనకు తగదు అన్నారు. రేపు టీడీపీఅధికారంలోకి వస్తే చర్యకు ప్రతి చర్య తప్పకుండా ఉంటుందని తీవ్రంగా ధ్వజమెత్తారు. సీఎం జగన్ ఆదేశాలతో టిడిపి ఇన్చార్జిలపై అక్రమంగా కేసులు పెట్టి వారిని భయపెట్టే విధంగా ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మీ తాటాకు చప్పట్లతో భయపడే వారు ఎవ్వరు లేరు మీరు ఎన్ని కేసులు పెట్టుకున్న తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన వెంటనే దీనికి రెండింతలుగా వారిపై చర్యలు తీసుకోబడుతుందని హెచ్చరించారు. రమేష్ రెడ్డి పై నాన్ బెయిలబుల్ సెక్షన్లు బనాయించడం ఎంత పిరికి పంద చర్య అని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే వారి అనుచరులు రాయచోటి నియోజకవర్గం లో ఉన్న పేద ప్రజల డికేటి భూములన్నీ స్వాధీనం చేసుకొని కోట్లాది రూపాయలు సంచులు నింపుకుంటున్న సంగతి ప్రజలందరికీ తెలిసిందే అన్నారు. రమేష్ రెడ్డి రాయచోటి నియోజకవర్గం లో ఎక్కడైనా ఒక్క సెంటు డీకేటి భూమి స్వాధీనం చేయలేదని దమ్ముంటే నిరూపించగలరా అని సవాల్ విసిరారు. రమేష్ రెడ్డిపై పెట్టిన కేసులు తీయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిట్లూరు టీడీపీ నాయకులు రామకృష్ణ గౌడ్, గణేష్, భవనం వెంకటరామిరెడ్డి, లక్ష్మి రెడ్డి, పొసల శ్రీనివాసులు, దర్బార్ వీరానాగిరెడ్డి, మల్లికార్జున, కొండ రామిరెడ్డి పాల్గొన్నారు.

16 మంది కంటి రోగులకు ఆపరేషన్లు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో గల

లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 16 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాలోని రాయచోటి నియోజకవర్గంతో పాటు పలు ప్రాంతాల నుండి వచ్చిన 40 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 16 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 50 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ వై.వి స్వరూప గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ భాష, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు, అప్తమాలిక్ అసిస్టెంట్ రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి పాటుపడదాం

జిల్లా బిసి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ తరిగొండ ఈశ్వరయ్య

విశాలాంధ్ర-వీరబల్లి : బీసీల అభ్యున్నతికి పాటుపడ దాం అని జిల్లా బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ తరిగొండ ఈశ్వరయ్య అన్నారు. వీరబల్లి మండలంలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం బీసీల కోసం ఎంతో పాటు పడుతోంది అని అదేవిధంగా వెనుకబడిన బీసీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. అదే విధంగా మండల స్థాయిలలో కూడా బీసీల కమిటీ ఏర్పాటు చేసి బీసీ సంఘం మండల నాయకులను నియమిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే బీసీలు చాలా వెనుకబడి ఉన్నారని వారికి ప్రభుత్వం తరఫున పలు సంక్షేమ పథకాలతో పాటు కార్పొరేషన్ రుణాలను అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయనతో పాటు మట్లి సర్పంచ్ నాగార్జున ఆచారి యువ నాయకుడు గిరి ఉన్నారు.

గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి చేస్తున్న సీఎం జగన్..

- మాధవరం 2 గ్రామ సచివాలయ భవన ప్రారంభోత్సవంలో ఎంఎల్‌ఏ శ్రీకాంత్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు సీఎం జగన్ కృషిచేస్తు న్నారని ఎంఎల్‌ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాయచోటి రూరల్ మం డలం లోని మాధవరం 2 గ్రామ సచివాలయ నూతన భవన ప్రారంభ కార్యక్రమం లో మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, జెడ్ పి టి సి వెంకటేశ్వర రెడ్డి, బిసి నాయకుడు పల్లపు రమేష్, దివాన్, గంగిరెడ్డి, రాజారెడ్డి లతో కలసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయాలు రాష్ట్రాభివృద్ధికి ప్రమాణికాలుగా నిలిచాయన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ లను ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ , వాలంటీర్ వ్యవస్థ ప్రజల ముంగిటకే పార దర్శకంగా సేవలు అందిస్తోందన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న సచివాలయ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఆదర్శంగా నిలుస్తుం దన్నారు. గ్రామ సచివాలయ అధికారు లు, సిబ్బంది ప్రజా సమస్యల పరిష్కారా నికి ప్రత్యేక దృష్టి పెట్టాలని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సచివాలయ అధికారులు, వాలంటీర్లతో ఆయన మాట్లాడారు. చిత్తశుద్ధితో, స్నేహ పూర్వకంగా పనిచేసి ప్రజల మన్ననలను పొందాలని ఆయన సూచించారు.

ప్రజలకు మంచి రోజులు: టీడీపీ

విశాలాంధ్ర-పీలేరు: ప్రజలు అందరికి మంచి రోజులు రాబో తున్నాయని, కొంచెం ఓపిక చాలని పీలేరు లో టీస్టాల్‌లో కిషోర్ ఆదివారం వెల్లడించారు. పీలేరు పట్టణ ప్రజలతో కలిసి కోటపల్లి సర్కిల్ టీ.స్టాల్ లోకలిసిఅందరిని పేరు, పేరున టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆప్యాయంగా పలకరించారు.

చైతన్య సర్వీస్ సొసైటీకి రూ.25 వేలు వితరణ

విశాలాంధ్ర - మదనపల్లె : జాతీయ బాలల దినోత్సవం (నవంబర్ 14) పురస్కరించుకుని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థకు మిట్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, 2020 -22 బ్యాచ్ సుహాస్ ఉదవి ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ నరసింహ, వారి మిత్ర బృందంతో కలిసి విద్యా అవసరాల నిమిత్తం అక్షరాల రూ.25 వేలను ఆదివారం వితరణ చేశారు. ఈ మొత్తాన్ని కవిత రాణికి అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ ఎంతోమంది అనాథ పిల్లలకు ఆశ్రయమిచ్చి, వారి బాగో గులతో పాటు విద్యాబుద్ధులు నేర్పుతున్న చైతన్య ఆశ్రమ నిర్వాహకులు ఎంపీ ఆనందన్ సేవలు అమోఘమని కొనియాడారు. ఈ సంస్థ అభివృద్ధికి తనవంతు సహకారంగా రూ.25 వేలు అందజేయడం ఆనందంగా ఉన్నదన్నారు. సంస్థ అభివృద్ధికి తన వంతు ఆర్థిక సాయం అందజేసిన దాత డాక్టర్ నరసింహకు చైతన్య స్వచ్ఛంధ సేవా సంస్థ తరఫున హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేస్తున్నామన్నారు.

అయ్యప్ప స్వామి దేవస్థానంలో పడిపూజ

విశాలాంధ్ర -రాజంపేట: పట్టణ శివార్లలోని శ్రీ హరిహరసుత, శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఈనెల 16వ తేదీ వైభవంగా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త తుమ్మలపెంట పాల ప్రకాష్ తెలియజేశారు. స్థానిక శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఆదివారం ధర్మకర్తల మండలి ప్రతినిధులతో కలసి పడిపూజ కరపత్రాలను పాల ప్రకాష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శబరిమలలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంను నవంబర్ 16వ తేదీ తెరవనున్నట్లు తెలియజేశారు. శబరిమలలో అయ్యప్ప స్వామికి ఏ విధంగా పూజలు నిర్వహిస్తారో అదే తరహాలో 16వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు నిర్వహించి అనంతరం రాత్రి 7 గంటల సమయంలో వైభవంగా పడిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. దేవస్థానంలో మండల పూజ సమయంలో ప్రతిరోజు రాత్రిపూట వివిధ మాలలు ధరించిన స్వాములకు బిక్ష ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ఇందుకు గాను భక్తులు, దాతలు ధన, వస్తు రూపేనా సహాయ సహకారాలు అందిం చాలన్నారు. మొక్కుబడి ఉన్నవారు 7500రూపాయలు చెల్లిస్తే ఒక్కరోజు రాత్రి దీక్షపరులకు అన్నదాన కార్యక్రమం వారి పేరున నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మ కర్తలి మండలి ప్రతినిధులు కే ఆదినారాయణ, కే దాము ఆచారి, కే సత్యనారాయణ, కే రమేష్, ఐ సి వెంకటరెడ్డి, ఆర్ రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

అదర్శవంతంగా మానవత సేవలు

- మానవత సంస్థకు బాడీ ఫ్రీజర్ అందజేత

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: మానవత సేవలు అద్భుతంగా అధర్శనీయవంతంగా ఉన్నాయని శ్రీ విజయ లక్ష్మీ జ్యువలర్స్ షాప్ ప్రోపరేటర్ సుగవాసి జానకి రామ్, సుగవాసి మురళి మోహన్ మురళి మోహన్ లు అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని మాసాపేట లోని సుగవాసి నారాయణ స్వామి, విజయలక్ష్మి ల జ్ఞాపకార్థం కౌన్సలర్ ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి మురళి, వైసిపి నాయకులు తిరుపాల్ నాయుడు లతో కలిసి మానవత రాయచోటి శాఖ చైర్మన్ అరమాటి శివగంగి రెడ్డి, అధ్యక్షులు కనపర్తి శివశంకర్ రెడ్డి, సెక్రెటరీ రామానాయుడు లకు బాడీ ఫ్రీజర్ బాక్సు ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ పేదలకు, అభాగ్యులకు ఎటువంటి లాభాపేక్ష లేకుండా సమిష్టిగా సేవలు అందచేయడం చాలా అభినందనియమని కొనియాడారు. తల్లి దండ్రులు జ్ఞాపకార్థం బాడీ ఫ్రీజర్ బాక్స్ ను మానవత కుటుంబ సభ్యులకు అందజేయడం అభినంద నీయ మన్నారు. మానవత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ దాతల సహకారంతోనే మానవత ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా సేవలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మానవత సభ్యులు సహదేవ రెడ్డి, జిల్లా కన్వీనర్ వెంకట్రామి రెడ్డి(బాబు), వైస్ ప్రెసిడెంట్ సంచులు ఖాదర్ బాషా, కన్వీనర్ యన్ యం డి షకీల్, మనోహర్ రెడ్డి, మనం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ప్రకాష్ పాల్గొన్నారు.

రాజకీయ జీవితంలో మచ్చలేని వ్యక్తి రమేష్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రాజకీయ జీవితంలో మచ్చలేని వ్యక్తి రమేష్ రెడ్డి అని గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. ఆదివారం నాడు పార్టీ కార్యాలయం ముందర తెలుగుదేశం పార్టీ నాయకులతో నిరసన కార్యక్రమం చేపట్టారు అనంతరంగాజుల ఖాదర్ బాషా మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ సుదర్శన్ రెడ్డి ఇద్దరు ఎదుర్కొనే ధైర్యం లేక ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు మాజీ ఎమ్మెల్యే రమేష్ రెడ్డి పైబనాయించడం నీతిమాలిన చర్య అని అన్నారు. లక్కిరెడ్డిపల్లి మండలం... ముద్దిరేవుల గ్రామం కొత్త మాదిగ పల్లె నందు సంబంధించిన వ్యక్తులకు ఎటు వం టి సంబంధం లేదు ఆ భూమిని ప్రభుత్వం సంబంధించిన భూమి సుదర్శన్ రెడ్డి , అతని అనుచరుడు శివనారాయణ దౌర్జన్యంగా భూమిలోకి చొరబడి వట్టి కాల బాలక్రిష్ణ , వారిపై దౌర్జన్యం చేసి గొడవలు పడుతుంటే విషయం తెలిసి సంఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాలకు సర్దుబాటు చేయడం జరిగింది భూమి ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నా హరిజనులకు చెందినది అని ప్రజాప్రతినిధిగా సర్ది చెబితే స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి గారు ఇదే ఆసరా చేసుకుని పక్కన ఉన్న భూమి వారిని ఉసిగొలిపి రమేష్ రెడ్డి గారిపై ఎస్సీ ఎస్టీ కేసు బ నాయించడం ఎంతటి దుర్మార్గపు చర్య అన్నది స్పష్టంగా కనబడుతున్నదన్నారు. పోలీసు వారి సహకారంతో ఎమ్మెల్యే గారు ఇలా ప్రవర్తించడం ఆయనకు తగదు అన్నారు. రేపు టీడీపీ అధికారంలోకి వస్తే చర్యకు ప్రతి చర్య తప్పకుండా ఉంటుందని తీవ్రంగా ధ్వజమెత్తారు. రమేష్‌రెడ్డిపై పెట్టిన కేసులు తీయకపోతే ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారుఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఖాదరవల్లి టీడీపీ నాయకులు కొట్టే చలపతి, అబూజార్ హుస్సేన్, మహబూబ్ అలీ ,సత్య రెడ్డి, గన్మెన్ రాజు, జావీద్ మైనుద్దీన్ అతావుల్లా ,రెడ్డయ్య, సాయి, శంముగం, ఇనాము తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను పరిశీలించిన జనసేన నాయకులు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: జగనన్న ఇల్లు పేదలందరికీ కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగా రాయచోటి అసెంబ్లీ ఇన్చార్జ్ హసన్ భాష ఆధ్వర్యంలో రాయచోటిలో ఉన్న టిడ్కో గృహాలను జనసేన బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు రామా శ్రీనివాస్, ప్రదీప్, మస్తాన్ జయరాం చిన్నారి మాట్లాడుతూ టిడ్కో గృహాలను అధికార వైసీపీ పార్టీ బూత్ బంగ్లాలుగా మార్చిందన్నారు. గత ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లను పూర్తి చేయకుండా వైసిపి ప్రభుత్వం అనర్హులకు ఇచ్చారని, ఇప్పటివరకు గృహాలను లబ్ధిదారులకు అందజేయ లేదన్నారు. సొంత ఇంటి కల సాకారం పేదలు ఇళ్లలోనే మగ్గుతూ నేటికీ నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా కేవలం ప్రతిపక్షాలను తిట్టటమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ కు పేదల పట్ల చిత్త శుద్ధి ఉంటే వెంటనే టిడ్కో గృహాలను పూర్తిచేసి లబ్ధిదారులకు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రానున్న కాలంలో జనసేన ప్రభుత్వం లబ్ధిదారులకు గృహాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పఠాన్, మయానా మొహమ్మద్ అలీ, జిల్లా దూదేకుల సంఘం అధ్యక్షులు మస్తాన్, జయరాం చిన్నారి, ఉదయగిరి శివ, నగేష్, నాగేంద్ర, నవీన్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా యంగ్ ఇండియా సేవా సమితి వార్షికోత్సవం

- సంస్థ సభ్యులకు ఘన సన్మానం

విశాలాంధ్ర - బి. కొత్తకోట : సమాజ సేవా కార్యక్రమాల్లో తనదైన పాత్ర పోషిస్తున్న యంగ్ ఇండియా సేవా సమితి సంస్థ నాలుగవ వార్షికోత్సవాన్ని తంబళ్లపల్లె నియోజకవర్గం, బి.కొత్తకోట పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు తగాది రాజశేఖర్ మాట్లాడుతూ జ్యోతి చౌక్ నందు ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం స్థానిక సంత బజారులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నాలుగో వార్షికోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పిటిసి రామచంద్ర యాదవ్, మాజీ సర్పంచ్ కుడుము శ్రీనివాసులు, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ మెంబర్ నక్క మహేష్, ఎన్ విజె హాస్పిటల్ యాజమాన్యం కర్ణాటకలోని వసకోట, యంగ్ ఇండియా సేవా సమితి హాజరయ్యారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా సేవ సమితి చేస్తున్న పలు కార్యక్రమాలను కార్యక్రమానికి ముందు తీసుకువెళ్లే పనులను వారు కొనియాడారు. సేవా గుణం కలిగి ఉండడం ఎంతో గొప్ప విషయమని అలాంటి గుణం అందరిలోనూ ఉండేలా ప్రోత్సహించి పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న యంగ్ ఇండియా సేవా సమితి వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామని వారు తెలిపారు. అలాగే యంగ్ ఇండియా సేవ సమితి సభ్యులకు దుస్సాలువతో ప్రత్యేకంగా సన్మానం నిర్వహించారు. అనంతరం యంగ్ ఇండియా సేవా సమితి వ్యవస్థాపకుడు తగాది రాజశేఖర్ మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం, మదర్ తెరిసా, స్వామి వివేకానందల స్ఫూర్తితో రక్తదానం, నిరుపేదలకు అన్నదానం, రోగులకు చికిత్స అందించడం తదితర సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సంస్థ స్థాపించినప్పుడు ముగ్గురితో మొదలై ఇప్పుడు బి.కొత్తకోట, పెద్దతిప్ప సముద్రం, బెంగుళూరు తదితర ప్రాంతాల్లో 150 మందికి పైగా యంగ్ ఇండియా సేవ సమితి సభ్యులు ఉన్నట్లు తెలిపారు. పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న తమకు మరింత ప్రోత్సాహం ఇస్తూ మాతో నడుస్తున్న తమ సభ్యులు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. అనంతరం స్థానిక జ్యోతి చౌక్ నందు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం మధ్యాహ్నం 1 గంట నుండి 5 గంటల వరకు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తలారి మంజునాథ్ ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్పిటిసి రామచంద్ర యాదవ్, మాజీ సర్పంచ్ కుడుము శ్రీనివాసులు, నక్క మహేష్ తదితరులను యంగ్ ఇండియా సేవా సమితి వ్యవస్థాపకుడు రాజశేఖర్ శాలువాలతో సత్కరించారు. యంగ్ ఇండియా సేవా సమితిలో పనిచేస్తున్న సభ్యులకు ముఖ్య అతిథులు చేత శాలువాలు, పూలమాలతో ఘనసన్మాన కార్యక్రమం నిర్వహించారు.